
ఆంధ్రజ్యోతి



ANDHRAJYOTHY భద్రాద్రి కొత్తగూడెం

BHADRADRI KOTHAGUDEM

బుధవారం, 20 మార్చి 2024

మంగళవారం ఉష్ణోగ్రత

	కనిష్ఠం	గరిష్ఠం
ఖమ్మం	24	34
భద్రాద్రి	20	33

రంజాన్ వేళలు

ఇఫ్తార్ : 6:25 (బుధవారం)

సహర్ : 4:53 (గురువారం)



కాంగ్రెస్‌లో ఖమ్మం ఎంపీ సీటు సస్పెన్స్ థ్రిల్లర్‌గా మారింది. ఆశావహుల సంఖ్య పెద్ద సంఖ్యలో ఉండటంతో టికెట్ ఎవరికి దక్కుతుందనేది రాజకీయ పండితులకు సైతం అంతుబట్టడం లేదు. కాంగ్రెస్ అధిష్ఠానం మంగళవారం రెండో జాబితాలో ఖమ్మం అభ్యర్థిని తేల్చేస్తుందని ప్రచారం జరిగినా, అర్ధరాత్రి వరకు ఎలాంటి సమాచారం అందలేదు. బుధవారం ప్రకటిస్తారని కొందరు, మరికొంత సమయం తీసుకుంటారని మరికొందరు చెబుతున్నారు. టికెట్ రేసులో ప్రధానంగా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సోదరుడు ప్రసాదరెడ్డి, ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క సతీమణి నందిని, మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తనయుడు యుగంధర్ పేర్లు వినిపిస్తున్నా, ఇంకా అనేకమంది ప్రముఖులు తమ అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు.

అభయ 'హస్తం' ఎవరికో..?

- ఖమ్మం ఎంపీ అభ్యర్థి ఎంపికపై కాంగ్రెస్ అధిష్ఠానం మల్లగుల్లాలు
- రేసులో పొంగులేటి ప్రసాదరెడ్డి, మల్లు నందిని, తుమ్మల యుగంధర్...
- ఆశావహుల జాబితాలో పలువురు ప్రముఖులు
- టికెట్ కోసం ఎవరికి వారుగా లాబీయింగ్
- పార్టీ శ్రేణుల్లో పెరుగుతున్న ఉత్కంఠ
- అందరి చూపూ హస్తిన వైపే

ఖమ్మం, మార్చి19 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ఖమ్మం కాంగ్రెస్ టికెట్ ఆ పార్టీకే పరీక్షగా మారింది. టికెట్ ఎవరికి దక్కుతుందోనని అందరికే హస్తిన వైపే చూస్తున్నారు. ఖమ్మం టికెట్ కోసం ఢిల్లీలో గట్టి లాబీయింగే నడుస్తోంది. మంత్రుల వారసులు, టికెట్ల కోసం ఆశావహుల మధ్య నువ్వా నేనా అన్నట్టుగా కాంగ్రెస్ టికెట్ల రేసు సాగుతోంది. తెలంగాణలో ఎన్నికలు నాలుగో విడతలో ఉన్నందున ఖమ్మం అభ్యర్థి ఎంపికకు మరింత జాప్యం అయ్యే అవకాశం కనిపిస్తోంది. రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సోదరుడు ప్రసాదరెడ్డి, వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తనయుడు యుగంధర్, ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క సతీమణి నందిని టికెట్ ప్రయత్నాల్లో ఉన్నారు. తన సతీమణికి టికెట్ ఇప్పించుకోవాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఢిల్లీలో లాబీయింగ్ నడుపుతున్నారు. మరోవైపు పొంగులేటి శ్రీనివాసరెడ్డి కూడా తన సోదరుడికి టికెట్ కోసం సామ దాన దండోపాయాలను ఉపయోగిస్తున్నారు. మంత్రి తుమ్మల తనయుడు యుగంధర్ కూడా కాంగ్రెస్ పెద్దలను కలిసి లోక్‌సభ టికెట్‌కు అవకాశం కల్పించాలని ఇప్పటికే విజ్ఞప్తి చేశారు. టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జట్టి కుసుమకుమార్, మాజీ ఎంపీ వి.హనుమంతరావు, వీవీసీ వ్యాపార సంస్థల అధినేత వంకాయలపాటి రాజేంద్రప్రసాద్, మాజీ ఎమ్మెల్సీ పోట్ల నాగేశ్వరరావు తదితరులు కూడా టికెట్ ఆశిస్తున్నారు. టికెట్ రేసులో ఉన్న రాయల నాగేశ్వరరావుకు రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ పదవి దక్కడంతో ఆయన బరి నుంచి తప్పుకున్నారు.

ముగ్గురు మంత్రుల కుటుంబసభ్యులు కాంగ్రెస్‌లోని టికెట్ ఆశాపరులు ఎవరి లాబీయింగ్‌లో వారు టికెట్ ప్రయత్నాల్లో ఉండడంతో సర్వత్రా ఉత్కంఠత నెలకొంది.

ఖమ్మం కాంగ్రెస్ టికెట్ కేటాయింపు కాంగ్రెస్ అధిష్ఠానానికి కూడా పెద్ద పరీక్షగా మారింది. గత అసెంబ్లీ ఎన్నికల్లో ఖమ్మం లోక్‌సభ పరిధిలోని అన్ని స్థానాలు కాంగ్రెస్, సీపీఐ కూటమి నుంచి గెలవడం, 2లక్షల68 వేల పైగా మెజారిటీ ఉండడంతో కాంగ్రెస్ అభ్యర్థి గెలుపు లోక్‌సభ ఎన్నికల్లో సులభంగా ఉంటుందని ఆశావహులు భావిస్తున్నారు. టికెట్ లభిస్తే ఎంపీగా గెలవడం గ్యారంటీ అన్న ప్రచారం సాగుతోంది. దీంతో గతంలో ఎన్నడూ లేని విధంగా ఖమ్మం కాంగ్రెస్ టికెట్‌కు కుస్తీ సాగుతోంది. అంతర్గతంగా ఎవరి కోణంలో వారు కాంగ్రెస్ అధిష్ఠానాన్ని మెప్పించి టికెట్ తెచ్చుకునే ప్రయత్నాలు సాగిస్తున్నారు.

వాస్తవానికి ఖమ్మం లోక్‌సభ టికెట్ మాజీ ఎంపీ రేణుకా చౌదరికి దక్కుతుందని మొదట్లో అందరు భావించారు. అనూహ్యంగా ఆమెకు రాజ్యసభ టికెట్ కేటాయించడం, ఎన్నిక కావడంతో ఆమె లోక్‌సభ టికెట్ ఆశాపరుల నుంచి ఆమె తప్పుకొన్నారు. ఈ క్రమంలోనే ఎంపీ టికెట్ పొంగులేటి ప్రసాదరెడ్డికి ఖరారు అన్న ప్రచారం దాదాపు సాగుతుండగా ఉపముఖ్యమంత్రి భట్టి సతీమణి నందినికి దక్కుతుందని వారి వర్గీయులు పేర్కొంటున్నారు. జిల్లాలో సామాజిక సమీకరణాలు దృష్టిలో పెట్టుకుని తుమ్మల యుగంధర్‌కు టికెట్ వస్తుందని తుమ్మల వర్గీయులు ఆశిస్తున్నారు. ముగ్గురు మంత్రుల వారసులకు కాకుండా బయటి వారికి టికెట్ ఇస్తారని, టికెట్ రేసులో ఉన్న ఇతర అభ్యర్థుల అనుచరులు ప్రచారం సాగిస్తున్నారు.

ఇంకా ప్రకటించని బీజేపీ

ఖమ్మం బీజేపీ అభ్యర్థి ఎవరు అన్నదానిపై కూడా సర్వత్రా ఆసక్తి నెలకొంది. ఖమ్మం ఎంపీ టికెట్ మాజీ ఎమ్మెల్యే జలగం వెంకటరావుకు దక్కుతుందని భావించారు. ఆయన బీజేపీ కండువా కప్పుకోవడంతో ఖమ్మం ఎంపీ టికెట్ వెంకటరావుకే అన్న సంకేతాలు వెలువడ్డాయి. వెంకటరావుతో పాటు బీజేపీలో చేరిన మాజీ ఎంపీ సీతారాంనాయక్‌కు బీజేపీ మహబూబాబాద్ టికెట్ కేటాయించింది. అయితే వెంకటరావు పేరును మాత్రం పెండింగ్‌లో ఉంచింది. తెలుగుదేశం, బీజేపీ పొత్తు ఉండడంతో బీఆర్‌ఎస్‌కు చెందిన ముఖ్య నేతలు ఎవరైనా బీజేపీలోకి వస్తే వారికి టికెట్ కేటాయిస్తారనే ప్రచారం సాగుతోంది. మరోవైపు బీఆర్‌ఎస్ అభ్యర్థిగా ప్రకటించి ప్రస్తుత ఖమ్మం ఎంపీ, బీఆర్‌ఎస్ లోక్‌సభ పక్ష నేత నామా నాగేశ్వరరావు టీడీపీ లేదా బీజేపీలో చేరి ఎన్నికల బరిలో దిగుతారని సోషల్ మీడియాలో ప్రచారం సాగుతోంది. నామా మాత్రం అలాంటిదేమి లేదని తాను బీఆర్‌ఎస్ అభ్యర్థిగానే బరిలో ఉంటానని చెబుతున్నారు.



కొత్తగూడెం మెడికల్ కళాశాలలో ఆందోళన చేస్తున్న మెడికోలు

సమస్యలు పరిష్కరించాల్సిందే...

- కొత్తగూడెం వైద్య కళాశాల విద్యార్థుల స్పష్టీకరణ
- రెండోరోజూ కొనసాగిన ఆందోళన
- తరగతులు బహిష్కరించి కళాశాల ఎదుట బైఠాయింపు
- డీఎంఈ ఆదేశాలతో రంగంలోకి విచారణ బృందం
- మరో విచారణ కమిటీని ఏర్పాటు చేసిన కలెక్టర్

కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్, మార్చి19: తమ సమస్యలు పరిష్కారం అయ్యేవరకు పోరాటం కొనసాగిస్తామని కొత్తగూడెం ప్రభుత్వ మెడికల్ కళాశాల విద్యార్థులు స్పష్టం చేశారు. మౌలిక సదుపాయాలు కల్పించాలని, ప్రిన్సిపాల్‌ను సస్పెండ్ చేయాలని కోరుతూ వైద్య విద్యార్థులు సోమవారం ఆందోళనకు శ్రీకారం చుట్టిన విషయం విదితమే. రెండోరోజైన మంగళవారం కూడా తరగతులు బహిష్కరించి కళాశాల వద్ద బైఠాయించి ఆందోళన కొనసాగించారు.

తరగతి గదుల్లో 150మంది విద్యార్థులకు కనీసం ఫ్యాన్ సౌకర్యం, వెంటిలేషన్ సదుపాయం లేవని, ప్యూరిఫైడ్ తాగునీరు ఏర్పాటు చేయడం లేదని విద్యార్థులు మండిపడ్డారు. తమ సమస్యలు పరిష్కరించాలని పలుసార్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ లక్ష్మణ్‌రావు దృష్టికి తీసుకెళ్లి వేడుకున్నా పట్టించుకోకుండా దురుసుగా మాట్లాడుతున్నారని మెడికల్ విద్యార్థులు ఆరోపించారు.

మధ్యాహ్నం సరిపడ భోజనం వండటం లేదని, కళాశాల ఆవరణలో క్రీడా ప్రాంగణాలు లేవని, పూర్తిస్థాయిలో వసతిగృహాలు లేక అద్దె భవనాల్లో వసతిగృహాలు ఏర్పాటు చేసి కొనసాగిస్తున్నారని ఆరోపించారు. పూర్తిస్థాయిలో ల్యాబ్‌లు అందుబాటులో లేవని, రోజులు గడుస్తున్నా పాఠ్యాంశాలపై పట్టు సాధించలేక పోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రైవేట్ వసతిగృహాలకు వెళ్లాలంటే సుదూర ప్రాంతానికి ప్రయాణం చేయాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని అన్నారు. దీంతో చదువుకునేందుకు సమయం సరిపోక ఇబ్బందులు పడుతున్నట్లు మెడికోలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమ సమస్యలు పరిష్కరించాలని జిల్లా కలెక్టర్‌ను కోరినట్లు పేర్కొన్నారు.

లిఖిత పూర్వక హామీ ఇస్తేనే

కళాశాలలో తాము ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరిస్తామని లిఖిత పూర్వకంగా హామీ ఇస్తేనే తరగతులకు వెళ్తామని మెడికోలు స్పష్టం చేశారు. మెడికోల ఆందోళన విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి వెళ్లి విద్యార్థులతో మాట్లాడారు. ఆందోళన విరమణకు వారు ససేమిరా అన్నారు. తమ సమస్యల పరిష్కారానికి ఎవరైనా బాధ్యత తీసుకుంటేనే ఆందోళన విరమిస్తామని స్పష్టం చేశారు. అయితే ప్రస్తుతం ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున్న బహిరంగ ప్రదేశాల్లో ఆందోళనలు, ధర్నాలు నిర్వహించడం నిషేధమని తేల్చి చెప్పడంతో విద్యార్థులు ధర్నాను విరమించి కళాశాల ప్రాంగణంలోనికి వెళ్లిపోయారు.

ఇదిలా ఉండగా, రెండో రోజు మెడికోలు ఆందోళన చేస్తున్న సమాచారం తెలుసుకున్న హైదరాబాద్‌లోని డైరెక్టరేట్ ఆఫ్ మెడికల్ ఎడ్యూకేషన్ (డీఎంఈ) కార్యాలయం స్పందించింది.

(మిగతా 6వ పేజీలో)



టెన్త్ విద్యార్థులకు వింత పరీక్ష

- ప్రధాన జవాబుపత్రం, ఓఎంఆర్ షీట్ ఇవ్వని ఇన్విజిలేటర్
- అడిషనల్ షీట్లు ఇచ్చి పరీక్ష రాయించిన వైనం
- తెలుగు పరీక్ష రోజున చోటుచేసుకున్న నిర్వాకం
- హిందీ పరీక్ష సందర్భంగా గుర్తించిన విద్యార్థులు

కొత్తగూడెం కలెక్టరేట్ మార్చి19: పదో తరగతి పరీక్షల నిర్వహణలో ఓ ఇన్విజిలేటర్ నిర్లక్ష్యం విద్యార్థులను ఆందోళనకు గురి చేస్తోంది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచలోని కేటీపీఎస్ జెడ్పీఎస్ఎస్ పాఠశాల (కోడ్‌నెం 9021)లో సోమవారం తెలుగు పరీక్ష సందర్భంగా రూం నెంబర్ 9లో ఇన్విజిలేటర్.. గదిలోని విద్యార్థులకు ప్రధాన జవాబుపత్రంతో పాటు విద్యార్థి వివరాలతో కూడిన ఓఎంఆర్ షీట్ ఇవ్వకుండా కేవలం అదనపు జవాబు పత్రాలు ఇచ్చి పరీక్ష రాయించాడు. ఈ విషయం మంగళవారం హిందీ పరీక్ష సందర్భంగా బయటపడింది.

పాల్వంచ కేటీపీఎస్ పాఠశాల పరీక్ష కేంద్రంలోని 9వ నెంబర్ గదిలో సోమవారం మొదటి పరీక్ష(తెలుగు)కు 22మంది విద్యార్థులు హాజరయ్యారు. పరీక్షకు హాజరైన విద్యార్థులకు ముందుగా ఓఎంఆర్ షీట్ ఇచ్చి వారు వివరాలు సరిచూసుకున్న తరువాత ప్రధాన జవాబుపత్రం(బుక్‌లెట్) ఇవ్వాల్సి ఉంది. కానీ ఆ గదిలో విధులు నిర్వహించిన ఓ ఇన్విజిలేటర్ విద్యార్థులకు ఓఎంఆర్ షీట్, ప్రధాన జవాబు పత్రం ఇవ్వకుండా నేరుగా అదనపు జవాబు పత్రాలు ఇచ్చి పరీక్ష రాయించాడు. పదో తరగతి విద్యార్థులు తొలిసారి వార్షిక పరీక్షలు రాస్తుండడంతో వారికి కూడా వీటిపై సరైన అవగాహన లేక ఇన్విజిలేటర్ ఇచ్చిన జవాబు పత్రాలపై పరీక్ష రాశారు. కానీ మంగళవారం రెండో పరీక్ష(హిందీ)కు వెళ్లిన ఆ రూంలోని విద్యార్థులకు ఇన్విజిలేటర్ ప్రధాన జవాబుపత్రం, ఓఎంఆర్ షీటు ఇవ్వడంతో ఈ విషయం వెలుగులోకి వచ్చింది.

ఓఎంఆర్ షీట్, ప్రధాన జవాబుపత్రాలను చూసిన విద్యార్థులు విస్మయం చెంది తమకు తొలి పరీక్ష రోజు ఇలాంటి జవాబుపత్రాలు ఇవ్వలేదని చెప్పడంతో విషయం బయటపడింది. ఆ రూములో 22 మంది విద్యార్థులు పరీక్ష రాశారు. ప్రస్తుతం ఆ విద్యార్థులంతా ఆందోళన చెందుతున్నారు. ముమ్మాటికీ ఇది పరీక్ష కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్ నిర్లక్ష్యం ఇన్విజిలేటర్ అవగాహనరాహిత్యంతో జరిగిందని విద్యార్థుల తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు.

పరీక్ష అనంతరం విద్యార్థులు రాసిన జవాబు పత్రాలను సీఎస్, డీవో పరిశీలించాల్సి ఉన్నా వారు అలా చేయలేదు. మంగళవారం రెండో పరీక్ష సందర్భంగా విద్యార్థులు చెబితేగానీ ఈ విషయం తెలియలేదంటే పరీక్ష విధుల పట్ల ఆ పరీక్ష కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్, డిపార్టుమెంటల్ అధికారుల చిత్తశుద్ధిని అర్థం చేసుకోవచ్చు.



విద్యార్థులకు ఎలాంటి నష్టం జరగదు

వెంకటేశ్వరచారి, భద్రాద్రి కొత్తగూడెం డీఈవో

పాల్వంచ కేటీపీఎస్ జడ్పీఎస్ఎస్‌లో సోమవారం తెలుగు పేపర్ సందర్భంగా ఓ పరీక్ష రూంలో విద్యార్థులకు ప్రధాన జవాబుపత్రం, ఓఎంఆర్ షీట్లు పంపిణీ చేయలేదనే విషయం మా దృష్టికి వచ్చింది. వారంతా అడిషనల్ జవాబు పత్రాలపై పరీక్ష రాశారు. అయినా వారికి ఎలాంటి నష్టం వాటిల్లదు. విద్యార్థులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. విధి నిర్వహణలో అధికారుల నిర్లక్ష్యంపై విచారణ చేస్తున్నాం.

పకడ్బందీగా ఎన్నికల విధులు

- అధికారులందరూ సమన్వయంతో పనిచేయాలి
- నిఘా బృందాలు అప్రమత్తంగా ఉండాలి
- సువిధ సింగిల్‌విండో ద్వారా అనుమతులు ఇవ్వాలి
- సి-విజిల్ పై విస్తృత ప్రచారం చేయాలి
- వృద్ధులు, దివ్యాంగులకు హోం ఓటింగ్ అవకాశం
- ప్రచార సామగ్రిపై ప్రచురణకర్త పేరు లేకుంటే సీజ్
- ఎన్నికల సంఘం మార్గదర్శకాలను అమలుచేయాలి
- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వీపీ గౌతమ్



ఖమ్మం కలెక్టరేట్‌లో అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ గౌతమ్. చిత్రంలో సీపీ సునిల్‌దత్, కేఎంసీ కమిషనర్ ఆదర్శ్ తదితరులు

ఖమ్మం కలెక్టరేట్, మార్చి19: ఎన్నికల నిర్వహణలో లోపాలు లేకుండా, ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు సమన్వయంతో నిర్వహించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వీపీ గౌతమ్ అన్నారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో పోలీస్ కమిషనర్ సునీల్‌దత్‌తో కలిసి, ఏఆర్వో, డీఎస్పీ, ఏసీపీ, నోడల్ అధికారులతో లోకసభ ఎన్నికల నిర్వహణపై కలెక్టర్ సమీక్షించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల విధులు చాలా కీలకమైనవని, ఎక్కడా ఏ చిన్న తప్పిదానికి తావివ్వకుండా వంద శాతం సజావుగా జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఫ్లయింగ్ స్క్వాడ్, ఎస్ఎస్టీ బృందాలను పూర్తి స్థాయిలో పనిచేయాలన్నారు. ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలకు వాహనాలు ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. నిఘా బృందాలు తమకు కేటాయించిన ప్రదేశాల్లో విధులు నిర్వహించాలన్నారు. అసెంబ్లీ సెగ్మెంట్ల వారిగా కేటాయించిన బృందాలను ఎక్కడ ఏర్పాటు చేసింది అడిగి తెలుసుకున్నారు. ఏఆర్వోలు నిఘా బృందాల పర్యవేక్షణ చేయాలన్నారు. క్రిటికల్, వల్నరబుల్ పోలింగ్ కేంద్రాల గుర్తింపు పూర్తి చేయాలన్నారు.

ప్రతీ పోలింగ్ కేంద్రంలో సీసీ కెమెరాల ఏర్పాటు చేయాలని, పోలీసుల నివేదిక మేరకు పోలింగ్ కేంద్రాల వెలుపల కూడా సీసీ కెమెరాలు ఏర్పాటుచేయాలన్నారు. ఏఆర్వోలు, పోలీస్ అధికారులు తమ పరిధిలోని ప్రతి ఒక్క పోలింగ్ కేంద్రాన్ని సందర్శించి, మౌలిక సదుపాయాలు, భద్రతాపరంగా చేపట్టాల్సిన చర్యల గురించి కార్యాచరణ చేయాలన్నారు. సువిధ సింగిల్ విండో ద్వారా అనుమతులు జారిచేయాలని, నిర్ణీత కాలవ్యవధిలోగా అనుమతులు జారీ అయ్యేలా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. రవాణా కార్యాచరణ పకడ్బందీగా చేయాలన్నారు. పంపిణీ కేంద్రాలు ఆయా సెగ్మెంట్ల పరిధిలోను, రిసెప్షన్ కేంద్రం ఒకేచోట కౌంటింగ్ కేంద్రం వద్ద ఏర్పాటు చేయాలన్నారు. కౌంటింగ్ కేంద్రాన్ని సందర్శించి, రిసెప్షన్ కేంద్రం, స్ట్రాంగ్ రూమ్ ఏర్పాట్లు చూసుకోవాలన్నారు.

85 సంవత్సరాలు పైబడిన వారికి, దివ్యాంగులకు హోం ఓటింగ్ కోసం ఫారం -12డి లను ఇంటింటికి అందజేయాలన్నారు. ఈ సమావేశంలో పోలీస్ కమిషనర్ సునీల్‌దత్ మాట్లాడుతూ, స్వేచ్ఛ, న్యాయబద్ధ ఎన్నికల నిర్వహణకు అన్ని చర్యలు తీసుకోవాలని అన్నారు. అక్రమ నగదు, లిక్కర్, ప్రలోభాల నియంత్రణకు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలన్నారు.

జిల్లాలో 12 ఎఫ్ఎస్టీ, 15 ఎస్ఎస్టి, 2 ఇంటిగ్రేటెడ్ ఇంటర్ స్టేట్ చెక్‌పోస్టులు, 10 ఇంటర్ స్టేట్ చెక్‌పోస్టులు, 8 ఇంటర్ డిస్ట్రిక్ట్ చెక్ పోస్టులు ఏర్పాటు చేసినట్లు, 24 గంటల నిఘా ఉంచినట్లు తెలిపారు. ప్రచార సామగ్రిపై ప్రచురణకర్త పేరు, వివరాలు లేకుంటే సీజ్ చేయాలన్నారు. సీజర్ సమయంలో అన్ని నియమ నిబంధనలను పాటించాలన్నారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల గుర్తింపును మార్గదర్శకాల మేరకు చేపట్టాలన్నారు.

ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు బి. సత్యప్రసాద్, డి. మధుసూదన్ నాయక్, ఖమ్మం నగరపాలక సంస్థ కమిషనర్ ఆదర్శ్ సురభి, శిక్షణా సహాయ కలెక్టర్లు మయాంక్ సింగ్, యువరాజ్, శిక్షణా ఐపీఎస్ పి.మౌనిక, అదనపు డీసీపీ ప్రసాద రావు, భద్రాద్రి కొత్తగూడెం అదనపు కలెక్టర్ వేణుగోపాల్, ఎస్డీసీ ఎం. రాజేశ్వరి, ఖమ్మం, కల్లూరు, కొత్తగూడెం ఆర్డీవోలు గణేష్, శ్రీనివాస్, మధు, డీసీవో మురళీధర్ రావు, ఐటీ అధికారి సాయి కుమార్, జిల్లా శిక్షణ నోడల్ అధికారి కొండపల్లి శ్రీరామ్, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

సి-విజిల్ పై ప్రచారం ..

ఎన్నికల పరిశీలకుల సందర్శన లోగా కౌంటింగ్ కేంద్రం ఏర్పాట్లు పూర్తి చేయాలని కలెక్టర్ అన్నారు. సి-విజిల్ పై విస్తృత ప్రచారం చేయాలన్నారు. యువతతో సమావేశాలు నిర్వహించి, సి-విజిల్ పై అవగాహన కల్పించాలన్నారు. ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు ఒక సెక్టార్ లో గరిష్ఠంగా 12 పోలింగ్ కేంద్రాలుండే విధంగా మరో 10 అదనపు సెక్టార్లు ఏర్పాటుచేశామన్నారు. ఒక పోలింగ్ కేంద్రం ఒకటి కంటే ఎక్కువ సెక్టార్లలో ఉండకుండా చూడాలన్నారు.

రామయ్యకు ఘనంగా సార్వభౌమ సేవ



భద్రాచలం, మార్చి 19: భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్రస్వామి వారికి పునర్వసు నక్షత్రాన్ని పురస్కరించుకొని మంగళవారం సార్వభౌమ సేవ నిర్వహించారు. ఉత్సవమూర్తులకు నూతన స్వర్ణభద్రకవచం ఏర్పాటు చేసిన నాటి నుంచి ఈ సేవను దేవస్థానం ఆధ్వర్యంలో ప్రతీ సంవత్సరం నిర్వహిస్తున్నారు ఈ సందర్భంగా స్వామి వారిని అందంగా అలంకరించిన సార్వభౌమ వాహనంలో సేవ నిర్వహించారు. ప్రతి ఫాల్గుణ పునర్వసు నాడు స్వామి వారికి సార్వభౌమ సేవ నిర్వహించడం జరుగుతుంది. ఈ సమయంలో స్వామి వారిని భక్తులు దర్శించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. కాగా మంగళవారం నాడు ఆలయ ప్రాంగణంలోని దాసాంజనేయస్వామి వారికి ప్రత్యేక స్నపనంను నిర్వహించారు.

బీఆర్‌ఎస్‌కు సిద్దులు గుడ్‌బై



కోదండరాంతో సిద్దులు

భద్రాచలం, మార్చి19: తొలి, మలితరం తెలంగాణ పోరాట యోధుడు తిప్పన సిద్దులు బీఆర్‌ఎస్‌కు గుడ్‌బై చెప్పారు. భద్రాచలానికి చెందిన సిద్దులు రెండు దశాబ్దాలుగా బీఆర్‌ఎస్‌లో క్రియాశీలకంగా వ్యవహరించారు. కొంత కాలంగా పార్టీ రాష్ట్ర నాయకుల తీరు పట్ల అసంతృప్తితో ఉన్న ఆయన తన రాజీనామా పత్రాన్ని పార్టీ నాయకత్వానికి పంపారు. ఈ క్రమంలో మంగళవారం తెలంగాణ జన సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు కోదండరాం సమక్షంలో హైదరాబాద్‌లో టీజేఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా సిద్దులు మాట్లాడుతూ 1969లో తెలంగాణ తొలితరం ఉద్యమంలో, 2001 మలి విడత ఉద్యమంలో చురుగ్గా పాల్గొన్న విషయాన్ని గుర్తు చేశారు. తొలి విడతలో నాలుగుసార్లు జైలుకు వెళ్లానని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం అనంతరం రెండు దఫాలు అధికారంలోకి వచ్చినా బీఆర్‌ఎస్ నాయకత్వం తనను విస్మరించిందని ఆవేదన వ్యక్తం చేశారు. అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ ఓటమి పాలైనా నాయకత్వంలో మార్పు రాకపోవడం తనను ఎంతో కలిచి వేసిందన్నారు. కాగా టీజేఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు కోదండరాం మాట్లాడుతూ తిప్పన సిద్దులు సేవలను బీఆర్‌ఎస్ నాయకత్వం గుర్తించకపోవడం శోచనీయమన్నారు.

పాట పెట్టి ప్రాణాలు తీస్తున్నారు...



- చర్ల కేంద్రంగా పశువుల అక్రమ రవాణా
- రహదారి పత్రాలతో యథేచ్ఛగా కబేళాలకు తరలింపు
- నేడు చర్లలో పంచాయతీ పశువుల సంత వేలం పాట

ఉలిక్కిపడిన దండకారణ్యం

- మహారాష్ట్రలో భారీ ఎన్‌కౌంటర్
- నలుగురు మావోయిస్టులు మృతి
- అప్రమత్తమైన తెలంగాణ, ఛత్తీస్‌గఢ్ బలగాలు
- తప్పించుకున్న వారి కోసం కూబింగ్

6

బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో

బోనకల్ క్రీడాకారుల ప్రతిభ

● జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణింపు ● కఠోర సాధనను అలవాటుగా మార్చుకుంటున్న క్రీడాకారులు



బాల్‌బ్యాడ్మింటన్ శిక్షణ పొందుతున్న క్రీడాకారులు

బోనకల్, మార్చి19: పాశ్చాత్య క్రీడల మోజులో గ్రామీణ సంప్రదాయ క్రీడలు కనుమరుగవుతున్నాయి. అత్యధికంగా అభిమానించే క్రికెట్ క్రీడను సైతం 20 ఓవర్లకే పరిమితం చేసి అమితానందంగా చూసే ఈ రోజుల్లో ఇంకా గ్రామీణ క్రీడగా పేరున్న బాల్ బ్యాడ్మింటన్‌ను ఆదరిస్తున్నారు ఖమ్మం జిల్లా బోనకల్ వాసులు. క్రీడకు పూర్వ వైభవం తీసుకువచ్చి వందల పతకాలను సాధించి రాష్ట్రస్థాయిలో అందరి మన్నన లను అందుకుంటున్నారు. ఎందరో క్రీడాకారులను తీర్చిదిద్దిన కోచ్ అమరేసి లింగయ్య కొత్తతరం క్రీడాకారులను ప్రోత్సహిస్తున్నాడు. బాల్ బ్యాడ్మింటన్ అంటే బోనకల్ చిరునామాగా చెబుతున్న క్రీడా నైపుణ్యం, క్రీడాకారులు, కోచ్‌ల పై ఆంధ్రజ్యోతి ప్రత్యేక కథనం..

స్టార్ ఆఫ్ ఇండియాకు 10మంది క్రీడాకారుల ఎంపిక

బాల్ బ్యాడ్మింటన్ క్రీడలో బోనకల్ నుంచి రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో దాదాపు 300 మంది క్రీడాకారులు రాణిస్తున్నారు. 10 మందికి స్టార్ ఆఫ్ ఇండియా, నలుగురికి ఆల్ ఇండియా బెస్ట్ ప్లేయర్ అవార్డులు వచ్చాయి. ఇప్పటి వరకు జరిగిన 42 సబ్ జూనియర్ జాతీయ స్థాయి పోటీలల్లో 6సార్లు సత్తా చాటారు. నేపాల్‌లో జరిగిన సీనియర్ బాల్ బ్యాడ్మింటన్ అంతర్జాతీయ స్థాయి పోటీల్లో బోనకల్‌కు చెందిన భూక్యా ఉమా చాంపియన్ షిప్ సాధించింది. 10సార్లు రాష్ట్ర స్థాయి పోటీలలో చాంపియన్ షిప్‌ను మహిళల విభాగంలో సాధించారు. బాలుర విభాగంలో కూడ అత్యధికంగా చాంపియన్ షిప్‌ను సాధించారు. 2020లో స్కూల్‌గేమ్స్ చాంపియన్ షిప్‌ను బోనకల్ కైవసం చేసుకుంది. 2021లో మహబూబ్‌నగర్ జిల్లా వనపర్తిలో జరిగిన సీనియర్ ఛాంపియన్ షిప్ పోటీలలో మహిళల జట్టు ప్రథమ స్థానం నిలిచింది. 2021లోసబ్ జూనియర్ విభాగం రాష్ట్రస్థాయి పోటీల్లో బాలికల జట్టు చాంపియన్ షిప్‌ను కైవసం చేసుకుంది. 66వ జూనియర్ రాష్ట్రస్థాయి బాలికల విభాగంలో కూడ ప్రథమ స్థానంలో నిలిచారు. 2022లో హైదరాబాద్‌లో జరిగిన 67వ సీనియర్ రాష్ట్ర చాంపియన్ షిప్ పోటీలలో మహిళల జట్టు ప్రథమ స్థానం సాధించింది. 2022-23కు సంబంధించి గోదావరిఖనిలో జరిగిన 68వ సీనియర్ రాష్ట్ర చాంపియన్ షిప్‌ను మహిళల జట్టు సాధించింది. గత ఏడాది బోనకల్‌లో జరిగిన 67వ జూనియర్ రాష్ట్రస్థాయి పోటీల్లో జిల్లా జట్టు విజయం సాధించింది. నిజామాబాద్‌లో జరిగిన 41వ సబ్ జూనియర్ బాలికల రాష్ట్రస్థాయి పోటీలలో ప్రథమ స్థానం సాధించింది. అర్మూర్‌లో జరిగిన 42వ రాష్ట్ర చాంపియన్ షిప్ పోటీలలో బాలికల జట్టు ప్రథమ స్థానం సాధించింది. రాష్ట్రస్థాయిలో అత్యుత్తమ క్రీడా ప్రతిభ చాటిన పలువురు బోనకల్ క్రీడాకారులు



బహుమతులతో క్రీడాకారులు

బాల్‌బ్యాడ్మింటన్ పోటీలకు కోచ్‌గా రాణిస్తున్న లింగయ్య



బోనకల్ మండలం ముష్టికుంట్ల గ్రామానికి చెందిన అమరేసి లింగయ్య బ్యాడ్మింటన్ క్రీడాకారుడు కావడంతో తన ముగ్గురు కుమార్తెలను బోనకల్‌లో ఆటలో శిక్షణ ఇచ్చేవాడు. బోనకల్‌లోని విద్యార్థులు శిక్షణ వైపునకు రావడం ఆట పైమక్కువ చూపేవారు. దీంతో తన కుమార్తెలతో పాటు అందరికి ఆటలో శిక్షణ ఇచ్చారు. క్రమేణా ప్రతి ఏటా క్రీడాకారుల సంఖ్య పెంచుకుంటూ పోవడంతో పాటు రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో పథకాలు సాధించడంతో బాల్ బ్యాడ్మింటన్ క్రీడకు వన్నె తెచ్చాడు. కోచ్‌గానే కాకుండా రాష్ట్ర బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ అర్గనేజింగ్ సెక్రటరీగా పని చేస్తున్నాడు. ఆర్థిక ఇబ్బందులను భరిస్తూనే పలువురు క్రీడాకారులకు బాల్‌బ్యాడ్మింటన్‌లో శిక్షణ ఇస్తున్న లింగయ్యను పలువురు అభినందించాస్తున్నారు.

ఉద్యోగ నియామకాల్లో రిజర్వేషన్ల వర్తింపు

బాల్ బ్యాడ్మింటన్ క్రీడలో ప్రాచుర్యం పొందిన క్రీడాకారులకు విద్య, కేంద్ర ఉద్యోగ నియామకాల్లో రిజర్వేషన్ల వర్తింపు జరుగుతుంది. ఇదే రీతిలో రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాల్లో కూడ క్రీడా కోటాను అమలు చేయాలని క్రీడాకారులు విజ్ఞప్తి చేస్తున్నారు. పోస్టల్ శాఖలో బోనకల్‌కు చెందిన ముగ్గురు క్రీడాకారులు ఉద్యోగాలు సాధించారు. ప్రతిరోజు బాల్ బ్యాడ్మింటన్ శిక్షణలో కఠోర సాధనను విద్యార్థులు అలవాటుగా మార్చుకుంటున్నారు. సోషల్ వెల్ఫేర్ గురుకులంలో చదివే 40 మంది బాలికలు పీఈటీ సంధ్యారాణి, పీడీ స్వాతి పర్యవేక్షణలో శిక్షణ పొంది రాష్ట్రస్థాయి పోటీలలో రాణించి సొసైటీతో పాటు బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్‌లో మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. 9వ తరగతి విద్యార్థినీ కె. మధులత సబ్ జూనియర్, జూనియర్, సీనియర్ విభాగాల్లో రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణిస్తుంది. ఇదే క్రమంలో బోనకల్ ఉన్నత పాఠశాల విద్యార్థిని టి. జ్యోతిర్మయి రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీలలో పాల్గొని అత్యుత్తమ క్రీడా ప్రతిభ కనబరిచి అందరి మన్ననలను పొందుతుంది.

సమస్యలు పరిష్కరించాల్సిందే..

(5వ పేజీ తరువాయి)

తక్షణమే ఆందోళనపై విచారణ చేపట్టాలని ఆదేశించింది. ఖమ్మం మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ ఆధ్వర్యంలో బృం దాన్ని ఏర్పాటు చేసి కొత్తగూడెం మెడికల్ కళాశాలకు వెళ్లాలని ఆదేశించారు. కళాశాలలో జరుగుతున్న పరిణామాలపై ఆ బృందం విచారణ ప్రారంభించింది.



మెడికోల సమస్యలు తెలుసుకుంటున్న పోలీసులు

కొత్తగూడెం (ఆంధ్రజ్యోతి): కొత్తగూడెం మెడికల్ కళాశాల సమస్యలపై విచారణ కమిటీని ఏర్పాటు చేసినట్లు భద్రాద్రి కలెక్టర్ ప్రియాంక అల మంగళవారం తెలిపారు. విద్యార్థుల హస్టల్‌లో కనీస సౌకర్యాలు లేవని, భోజనంలో నాణ్యత తదితర సమస్యలపై విద్యార్థులు ఆందోళనకు దిగిన విషయం విదితమే. ఈ నేపథ్యంలో కళాశాలలో సమస్యలపై జడ్పీ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఎస్. ప్రసూన రాణి అధ్యక్షతన విచారణ కమిటీని ఏర్పాటు చేశారు. ఈ కమిటీలో చీఫ్‌ప్లానింగ్ ఆఫీసర్ యూ. శ్రీనివాసరావు, జిల్లా ఉద్యానవన అధికారి కె.సూర్యనారాయణ సభ్యులుగా ఉన్నారు. కళాశాలలోని సమస్యలపై ఈ కమిటీ విచారణ చేసి 22వ తేదీ సాయంత్రం 5గంటల్లోపు నివేదిక అందచేయాలని కలెక్టర్ ఆదేశించారు.

పాట పెట్టి ప్రాణాలు తీస్తున్నారు...

చర్ల, మార్చి 19: సంత వేలంపాట పశువుల అక్రమ రవాణాకు రాజమార్గంగా మారుతోంది.. పంచాయతీ నుంచి ఇచ్చే రహదారి పత్రాలు పశువులను కబేళాలకు తరలించేందుకు అనుమతి పత్రాలుగా మారుతున్నాయి. భద్రాద్రి జిల్లా చర్లనుంచి పశువుల అక్రమ రవాణాకు అడ్డూ అదపూ లేకుండాపోతోంది. ఇక్కడ సాగుతున్న ఈ దందాను నిలువరించే నాదుడే కరువయ్యాడు. పశువులను వ్యవసాయ అవసరాలకు కొన్నామని రహదారి పత్రం తీసుకుని కొంతమంది వ్యాపారులు పశువులను హైదరాబాద్ వంటి నగరాలు, పట్టణాల్లోని కబేళాలకు తరలిస్తున్నారు. రాత్రి, పగలు తేడా లేకుండా వాటిని వ్యాన్లలో కుక్కి తీసుకెళుతుండడంతో అనేక పశువులు వాహనాల్లోనే ప్రాణాలు వదిలేస్తున్నాయి.

ఈ పశువుల రవాణా గురించి ఎవరైనా ప్రశ్నిస్తే తాము పశువులను పెంచుకోవడం కోసం తీసుకెళుతున్నట్లు సంత పాటదారుడు ఇచ్చే రశీదును చూపించి తప్పించుకుంటున్నారు. చర్లనుంచి ఇప్పటికే వేల సంఖ్యలో పశువులు ఇలా పట్టణాలకు తరలిపోయి ఆహారంగా మారాయి. ఈ వ్యవహారంపై సంబంధిత అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తుండడంతో ఈ అక్రమ వ్యాపారం మూడు పువ్వులు ఆరు కాయలుగా సాగుతోంది. ఇప్పటికైనా పంచాయతీ సంతపాటను అధికారులు రద్దు చేయాలని, లేని పక్షంలో నిబంధనల్లో మార్పులు చేస్తే తప్ప మూగజీవుల గోస ఆగదని స్థానికులు వాపోతున్నారు. ఈ విషయంల కలెక్టర్ చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

చర్ల పశువుల సంత వేలం పాటే మూగజీవుల పాలిట శాపంగా మారింది. వాస్తవానికి పంచాయతీలో ఎవరైనా పశువులను కొనుగోలు చేస్తే వాటిని కొన్నందుకు కొంత నగదు చెల్లించాల్సి ఉంటుంది. ఇలా చెల్లించిన నగదుకుగాను పాటదారుడు అనుమతి పత్రం ఇస్తాడు. ఇలా ఆ రశీదు తీసుకుని సదరు పశువులను ఎక్కడికైనా తరలించవచ్చు. ప్రస్తుతం ఆ రశీదులే పశువులను కబేలాలకు తరలించడానికి రాజమార్గంగా మారాయి. చత్తీస్‌గడ్ నుంచి తీసుకువచ్చిన పశువులను వ్యాపారులు కొనుగోలు చేసి, వాటిని వ్యాన్లలో తరలించే క్రమంలో రహదారి పత్రాన్ని రాయించుకుంటున్నారు. ఇలా గత కొంత కాలంగా చర్ల మండలంలో అక్రమ పశువుల రవాణా యథేచ్ఛగా సాగుతోంది. పశువుల వ్యాపారం లాభాల పంట పండిస్తుండడంతో పంచాయతీ వేలం పాట పాడేందుకు వ్యాపారులు క్యూకడుతున్నారు. రూ.25లక్షల నుంచి రూ.34లక్షల వరకు పాట పాడేందుకు సిద్ధమవుతున్నారు. ఈ క్రమంలోనే బుధవారం చర్ల పంచాయతీలో పశువుల సంత వేలం పాట జరగనుంది.

చర్ల మండలంలో రహదారి పత్రం పేరుతో జరుగుతున్న పశువుల అక్రమ రవాణాపై చర్ల మండల అధికారులు చర్యలు తీసుకోవాలని జంతు ప్రేమికులు కోరుతున్నారు. గత నాలుగు సంవత్సరాల లెక్కలను పరిశీలిస్తే చర్లనుంచి లక్షల పశువులు కబేలాలకు తరలిపోయినట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో చర్ల మండల అధికారులు నిబంధనలను కఠినతరం చేయాలని, లేని పక్శంలో మిగిలిఉన్న కొన్ని పశువులు కూడా కబేలాలకు తరలిపోయే ప్రమాదం ఉందని స్థానికులు వాపోతున్నారు. ఇప్పటికైనా చర్ల మండలంలో సాగుతున్న పశువుల అక్రమ రవాణాపై కలెక్టర్ దృష్టి సారించాలని స్థానికులు కోరుతున్నారు. అలాగే పశువులను తరలించే రహదారి పత్రంలో మార్పులు చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

కోలిండియా స్థాయిలో సత్తా చాటాలి

● ఎస్వోటు జీఎం కృష్ణయ్య



శిక్షణ పొందిన క్రీడాకారులతో ఏరియా అధికారులు

మణుగూరుటౌన్, మార్చి19: కోలిండియా స్థాయిలో జరిగే క్రీడా పోటీల్లో కబడ్డీ విభాగంలో సింగరేణి క్రీడాకారులు సత్తా చాటి విజయకేతనం ఎగురవేయాలని ఏరియా ఎస్వోటు జీఎం వీసం కృష్ణయ్య అన్నారు. మంగళవారం ఏరియాలో సింగరేణి అన్ని ఏరియాల ఉద్యోగ క్రీడాకారులకు శిక్షణ శిబిరం ముగింపు కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. క్రీడలతో మానసిక ఉల్లాసం, శారీరక దారుఢ్యంతోపాటు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపును తెచ్చిపెడుతాయన్నారు. శిక్షణ పొందిన క్రీడాకారులు ఇంతటితో వదిలివేయకుడదని, నిత్యసాధనతోనే క్రీడల్లో నైపుణ్యాన్ని పొందుతారన్నారు. అనుభవజ్ఞులతో ఇస్తున్న కబడ్డీ శిక్షణను శిక్షణ పొందిన ప్రతీ క్రీడాకారుడు సద్వినియోగ పరుచుకోవాలన్నారు. సింగరోలి ఎన్‌సీఎల్ నిర్వహించే కోలిండియా స్థాయి కబడ్డీ పోటీలో సింగరేణి క్రీడాకారుల అత్యంత ప్రతిభ కనబర్చి విజయపతాకాన్ని ఎగురవేయాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ఏరియా డీజీఎం పర్సనల్ ఎస్ రమేష్ మాట్లాడుతూ.. మణుగూరు ఏరియాలోని భద్రాద్రి స్టేడియంలో రీజనల్ కంపెనీ స్థాయి, కోలిండియా లెవల్ పోటీలను విజయవంతంగా నిర్వహించిన మణుగూరు ఏరియా ఎంతో గుర్తింపును తెచ్చుకుందన్నారు. కార్యక్రమంలో ఏజీఎం సివిల్ వెంకటేశ్వర్లు, ఏఐటీయూసీ నాయకులు రాంనర్సయ్య, అసిస్టెంట్ స్పోర్ట్స్ సూపర్‌వైజర్ జాన్ వెస్లీ, శిక్షకుడు మురుగన్, హైదరాబాద్ కో ఆర్డినేటర్ ఆర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మతోన్మాద విధానాలకు వ్యతిరేకంగా పోరాడాలి

● పీఓడబ్ల్యూ రాష్ట్ర కార్యదర్శి శిరోమణి



సమావేశంలో మాట్లాడుతున్న శిరోమణి

ఖమ్మం రూరల్, మార్చి 19: మతోన్మాద ఫాసిస్టు విధానాలకు వ్యతిరేకంగా దేశంలో ప్రజలు, మహిళలు పోరాడాలని పీఓడబ్ల్యూ రాష్ట్ర కార్యదర్శి సీహెచ్ శిరోమణి పిలుపునిచ్చారు. మంగళవారం మండల పరిధిలోని కాచిరాజుగూడెంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురష్కరించుకుని నిర్వహించిన సభలో ఆమె పాల్గొని మాట్లాడారు. సమాజంలో సగభాగమైన మహిళలు హక్కుల కోసం, సమానత్వ సాధన కోసం లింగ వివక్షకు వ్యతిరేకంగా పోరాడాల్సిన కర్తవ్యాన్ని కొనసాగించాలని అంతర్జాతీయ మహిళా దినోత్సవం గుర్తు చేస్తుందని వివరించారు. ప్రజలలో ఉన్న విశ్వాసాలు వెనుకబాటు తనాన్ని ఆసరగా చేసుకుని కేంద్రంలో బీజేపీ మత విద్వేషాలు రెచ్చగొడుతుందని ఆరోపించారు. అయోధ్య రామ మందిరం అంటూ రాముడిని కూడా రాజకీయ రొంపిలోకి దింపి ఎన్నికల్లో లబ్ధిపొందాలని చూస్తున్నారని విమర్శించారు. ప్రధాని మోదీ నారీశక్తి, నారీ గౌరవం అంటూనే మరోవైపు మహిళలకు రక్షణ లేకుండా చేస్తున్నారని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కోశాధికారి టి.ఝాన్సీ, జిల్లా కార్యదర్శి ఆవుల మంగతాయి, నాయకులు బందెల లలిత, సత్యవతి, వసుమతి, మమత, సరోజిని, సైదమ్మ, రాంబాయి, రాజమ్మ, ధనలక్ష్మీ, సూరమ్మ, సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ జిల్లా నాయకులు బందెల వెంకయ్య, మలీదు నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

గుండెపోటుతో మాజీ నక్సలైట్ మృతి



సత్యనారాయణ

కరకగూడెం, మార్చి19: మండలంలోని రఘునాథపాలెం గ్రామానికి చెందిన మాజీ నక్సలైట్ తంతెనపల్లి సత్యనారాయణ గౌడ్ అలియాస్ రమేష్ (50) అనే వ్యక్తి గుండెపోటుతో మంగళవారం మృతి చెందాడు. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. సత్యనారాయణకు మంగళవారం గుండె నొప్పి కుటుంబ సభ్యులు మణుగూరు తరలించారు. వైద్య చికిత్స అందిస్తుండగా మృతి చెందినట్లు తెలిపారు. కాగా మృతుడు 22ఏళ్ల క్రితం రవిందర్ దళంలో నక్సలైట్‌గా పనిచేశారు. పోలీసులు మావోయిస్టులు జన జీవన స్రవంతిలో కలిస్తే అన్ని విధాలుగా ప్రభుత్వం ఆదుకుంటుందని పిలుపు మేరకు టీడీపీ సీనియర్ నాయకులు చందా నరసింహారావు ఆధ్వర్యంలో పోలీసుల ముందు లొంగిపోయాడని తెలిపారు. జన జీవన స్రవంతిలో కలిసిన సత్యనారాయణకు పోలీస్ శాఖ నుంచి ఎటువంటి సహాయ సకరాలు అందలేదని పలు మార్లు చెబుతుండేదని గ్రామస్థులు తెలిపారు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. ప్రభుత్వం, పోలీస్ శాఖ అధికారులు స్పందించి మృతుని కుటుంబాన్ని ఆదుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

జాతీయస్థాయి హ్యాండ్‌బాల్ పోటీల రిఫరీగా మోహన్

ఖమ్మం స్పోర్ట్స్, మార్చి 19: మధ్యప్రదేశ్ రాష్ట్రంలో ఈనెల 23 నుంచి 27 వరకు జరగనున్న జాతీయ స్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు రిఫరీగా నగరానికి చెందిన మోహన్ రిఫరీగా ఎన్నికయ్యాడు. ఈమేరకు మంగళవారం జాతీయ హ్యాండ్‌బాల్ ఫెడరేషన్ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సందర్భగా జాతీయ పోటీలకు రిఫరీగా ఎంపికైన మోహన్‌ను పలువురు అభినందించారు.

వినాయకుడి ఆలయంలో చోరీ

మధిరటౌన్, మార్చి19: మధిరలో గల వినాయకుడి ఆలయంలోకి చొరబడి సోమవారం రాత్రి గుర్తు తెలియని దొంగలు హుండీ పగులగొట్టి రూ.50వేల నగదును అపహరించారు. ఈ విషయమై పూజారి రవిశాస్త్రి ఫిర్యాదు మేరకు టౌన్ ఎస్ఐ సంధ్య కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా ఇదే గుడిలో ఆరు నెలల క్రితం కూడా హుండీని పగలగొట్టి అందులోని నగదును ఎత్తుకెళ్లారు. ఇంత వరకు ఆ కేసుకు సంబంధించిన ఆచూకీ తెలియలేదు.

సేవాలాల్ ఆలయంలో చోరీకి యత్నం..

కొణిజర్ల, మార్చి19: మండల పరిధిలోని అమ్మపాలెం గ్రామంలో నూతనంగా చేపట్టిన సంత్ సూవాలాల్ ఆలయంలో చోరీకి ప్రయత్నించి మహిళలు పట్టుబడిన సంఘటన మంగళవారం సాయంత్రం చోటు చేసుకుంది. స్థానికులు, ఆలయ కమిటి సభ్యులు తెలిపినవ వివరాలు ప్రకారం.. గ్రామంలో కాగితాలు వేరుకుంటూ ఇద్దరు మహిళలు, ముగ్గురు చిన్నారులు ఆలయం వైపు వచ్చి ఆలయంలో ఉన్న ఇనుపసామాగ్రితో పాటు గోపురం కోసం తెచ్చిన చిన్న చిన్న గంటలను తీసుకోగా అనుమానం వచ్చి గట్టిగ ప్రశ్నించడంతో అవి బయటపడ్డాయని స్థానికులు తెలిపారు. పోలీస్‌లకు సమాచారం ఇచ్చి వారిని గట్టిగా మందలించి వదిలిపెట్టామని తెలిపారు.

వైరాలో సెల్‌ఫోన్ దుకాణంలో...

వైరా, మార్చి 19: వైరాలోని బ్రాహ్మణపల్లి అగ్రహారానికి చెందిన తోటపల్లి రామకృష్ణ తల్లాడ రోడ్డులో ఏసీపీ కార్యాలయానికి ఎదురుగా దక్షా అనే సెల్‌షాపు నిర్వహిస్తున్నాడు. ఈ సెల్ దుకాణంతో పాటు ఇంటర్‌నెట్ సెంటర్‌ను కూడా నిర్వహిస్తున్నాడు. సోమవారం అర్ధరాత్రి సమయంలో గుర్తు తెలియని దుండగులు దుకాణం తలుపులు పగులగొట్టి రూ.లక్ష విలువైన సెల్‌ఫోన్లు, రూ.10వేల నగదును అపహరించుకుపోయారు. బాధితుల ఫిర్యాదు మేరకు ఎస్ఐ వంశీకృష్ణ భాగ్యరాజ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మానసికవేదనతో వ్యక్తి ఆత్మహత్య

ఖమ్మం రూరల్, మార్చి 19: మానసిక వేదన భరించలేక వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన గూడూరుపాడులో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలో గూడూరుపాడు పంచాయతీ, పిట్టలవారిగూడెం గ్రామానికి చెందిన గట్ల రామయ్య(49) భార్య ఐదేళ్ల క్రితం చనిపోయింది. అప్పటినుంచి మానసికంగా ఇబ్బంది పడుతూ మద్యానికి బానిసయ్యాడు. సోమవారం ఎవరూ లేని సమయంలో గడ్డిమందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు వెంటనే అతడిని చికిత్స నిమిత్తం ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతి చెందాడు. మృతుడికి ముగ్గురు కుమారులున్నారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రామారావు తెలిపారు.

తనిఖీల్లో మద్యం సీజ్

ఖమ్మం కలెక్టరేట్, మార్చి 19: లోక్ సభ సాధారణ ఎన్నికలను పురష్కరించుకుని జిల్లాలో మంగళవారం పలుచోట్ల అక్రమ మద్యాన్ని సీజ్ చేసినట్లు అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా అధికారులు ఖమ్మం నగరపాలక సంస్థ రామన్నపేట వద్ద రూ. 19,628ల విలువైన, దానవాయిగూడెం వద్ద రూ.18,469 ల విలువైన, గోపాలపురం వద్ద రూ.4,681 ల విలువైన అక్రమ మద్యం పట్టుకొని సీజ్ చేసినట్లు తెలిపారు. అక్రమంగా మద్యం సరఫరా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

అడవిలో అలర్ట్..

» గడ్చిరోలి ఎన్‌కౌంటర్‌తో తెలంగాణ, ఛత్తీస్‌గఢ్ పోలీసుల అప్రమత్తం
» సరిహద్దుల్లో నిఘా కట్టుదిట్టం
» తప్పించుకున్న వారి కోసం కూబింగ్



తనిఖీలు చేస్తున్న ఎస్ఐ సూరి

చర్ల, మార్చి 19: మహారాష్ట్రలోని గడ్చిరోలి జిల్లా కొలమార్కు గుట్టల్లో మంగళవారం తెల్లవారుజామున ఎన్‌కౌంటర్ జరిగింది. తెలంగాణ మావోయిస్టు పార్టీకి చెందిన నలుగురు మావోయిస్టులు మృతి చెందారు. ఎన్‌కౌంటర్ జరిగిన ప్రాంతం నుంచి తుపాకులు, కిట్‌బ్యాగులను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కాగా ఈఘటన నుంచి చాలా మంది మావోయిస్టులు తప్పించుకున్నట్లు, అందులో పార్టీ అగ్రనాయలకులు ఉన్నట్లు మహారాష్ట్ర పోలీసులు ప్రకటించారు. దీంతో తెలంగాణ, ఛత్తీస్‌గడ్‌కు చెందిన పోలీసులు, ప్రత్యేక బలగాలు అప్రమత్తమయ్యాయి. బస్తర్ డివిజన్‌లోని బీజాపూర్, దంతెవాడ, సుకుమా, నారాయణపూర్, కొడెగావ్, కాంకేర్ జిల్లాలతోపాటు, తెలంగాణ సరిహద్దు అడవుల్లో గాలింపు ప్రారంభించాయి. ఎన్‌కౌంటర్‌లో తప్పించుకున్న మావోయిస్టులు ఆయా రాష్ట్రాల సరిహద్దుల్లోకి వచ్చే అవకాశం ఉండడంతో బలగాలు కూబింగ్ ప్రారంభించాయి. ఛత్తీస్‌గడ్‌లో డీఆర్‌జీ, బస్తర్ ఫైటర్స్ సీఆర్‌పీఎఫ్, మహిళా కమాండోస్, తెలంగాణలోని స్పెషల్ పార్టీ, గ్రేహౌండ్స్, సీఆర్‌పిఎఫ్ బలగాలు అడవుల్లోకి చొచ్చుకుని పోతున్నాయి. అడవుల్లోకి వెళ్లే అన్ని మార్గాలను పోలీసులు ఆధీనంలోకి తీసుకున్నట్లు తెలుస్తోంది. అలాగే తెలంగాణ రాష్ట్రంలోని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పోలీసులు అప్రమత్తమయ్యారు. రహదారుల వెంట తనిఖీలు ముమ్మరం చేశారు. అనుమానితులను ప్రశ్నించి వదిలేస్తున్నారు. మావోయిస్టుల కదలికలు ఉన్న చర్ల మండలంలో చర్ల సీఐ రాజువర్మ, ఎస్ఐలు టీవీఆర్ సూరి, నర్సిరెడ్డిలు తనికీలు చేస్తున్నారు. ఛత్తీస్‌గడ్ నుంచి వస్తున్న వారి వివరాలు నమోదు చేసుకుని ప్రశ్నించి వదిలేస్తున్నారు. అలాగే ఆంధ్రా ఒరిస్సా బోర్డర్‌లో కూడా బలగాలు గాలింపుని ముమ్మరం చేశారు. అలాగే సహచరులను కోల్పోయిన మావోయిస్టులు విధ్వసకరమైన ఘటనలకు పాల్పడే అవకాశం లేకపోలేదని, ఇంటిలిజెన్సీ వర్గాలు పోలీసులను అప్రమత్తం చేసినట్లు తెలుస్తోంది.

138 కేజీల గంజాయి స్వాధీనం

● ఇద్దరి అరెస్టు



గొల్లగూడెంలో పోలీసులు పట్టుకున్న గంజాయి, నిందితులు

అశ్వాపురం, మార్చి 19: వాహన తనిఖీల్లో 138కేజీల గంజాయిని పోలీసులు పట్టుకున్న సంఘటన మండలంలోని గొల్లగూడెంలో జరిగింది. సీఐ అశోక్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మహారాష్ట్ర ప్రాంతానికి చెందిన విశాల్‌హెగ్డే, జాదవ్ అను ఇద్దరు వ్యక్తులు కారులో వస్తుండగా గొల్లగూడెం గ్రామంలోని ప్రధాన రహదారిపై వాహన తనిఖీల్లో వీరు ప్రయాణిస్తున్న వాహనాన్ని పరిశీలించగా అందులో 138 కేజీల గంజాయిని ప్యాకెట్ల రూపంలో తరలిస్తున్న విషయం గమనించి స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నిందితులను విచారించగా చింతూరు నుంచి మహారాష్ట్రకు ఈ గంజాయిని తీసుకువెళ్తున్నట్లు తెలిసిందన్నారు. ఇరువురిపై కేసు నమోదు చేసి మంగళవారం కోర్టుకు తరలించామన్నారు.

ఖమ్మంలో గంజాయి ప్యాకెట్లతో ఉన్న నలుగురు యువకుల అరెస్టు

ఖమ్మం క్రైం, మార్చి19: గంజాయి ప్యాకెట్లతో ఉన్న నలుగురు యువకులను మంగళవారం ఖమ్మం టూటౌన్ పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు నగర ఏసీపీ రమణమూర్తి తెలిపారు. నగరంలోని టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం ఆయన వివరాలను వెల్లడించారు.. నగరంలోని రాపర్తినగర్ ప్రాంతంలో ఉన్న రైల్వే అండర్ బ్రిడ్జి కింద దానవాయిగూడేనికి చెందిన శీలం రవి, పెంద్ర వరుణ్, బుర్హాన్‌పురానికి చెందిన శ్రావణ్, మేకబండపార్కు ప్రాంతానికి చెందిన దోతుల సాయిరాఘవేంద్ర అను యువకులు గంజాయి పొట్లాలతో ఉండగా, తనిఖీల్లో ఉన్న టూటౌన్ పోలీసులు వారిని అదుపులోకి తీసుకున్నారని తెలిపారు. అనంతరం వారిని విచారించగా గంజాయి తాగేందుకు అలవాటుపడి శీలంరవి, పెంద్రవరుణ్ ఇద్దరు కలిసి వారం రోజుల క్రితం భద్రాచలం ప్రాంతంలోని సీలేరుకు వెళ్లి గుర్తు తెలియని వారి వద్ద నుంచి సుమారు ఆరకేజీ గంజాయి తీసుకొచ్చారు. వారు తాగేందుకు ఉంచుకొని మిగిలిన సుమారు 400గ్రాముల ఎండు గంజాయిని ప్యాకెట్లుచేసి అమ్ముతుండగా వారిని అదుపులోకి తీసుకున్నామని తెలిపారు. దీంతో వారిపై కేసు నమోదుచేసి గంజాయితో పాటు నాలుగు సెల్‌ఫోన్లను స్వాధీనం పరుచుకున్నట్లు ఏసీపీ తెలిపారు.

పోస్టాఫీసులో ఖాతాదారుల సొమ్ము మాయం

● లక్ష్మీనగరం బీపీఎం సస్పెన్షన్



విచారణ నిర్వహిస్తున్న ఏఎస్పీ సుచేందర్

దుమ్ముగూడెం మార్చి 19: సుకన్య సమృద్ధి యోజన పథకంలో పలువురు ఖాతాదారులు నగదు పొదుపు చేయగా కొందరి ఖాతాల నుంచి పోస్టు మాస్టరు నగదు స్వాహా చేసిన లక్ష్మీనగరం బ్రాంచి పోస్టాఫీస్‌లో మంగళవారం బైటపడింది. కాగా పోస్టాఫీసులో ఖాతాదారుల సొమ్ము మాయంపై ఏఎస్పీ సుచేందర్ విచారణ చేపట్టారు. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం..లక్ష్మీనగరానికి చెందిన బేరి ధర్మేంద్రరెడ్డి, శ్రీకాకుళపు వేమనలు తమ చిన్నారుల పేరిట సుకన్య సమృద్ధి యోజన పథకంలో కొంతకాలంగా ప్రతీ నెలా క్రమం తప్పకుండా పోస్టాఫీసులో నగదును జమచేస్తున్నారు. బేరి ధర్మేంద్రరెడ్డి ఖాతాలో రూ79,202 లు నగదును జమచేయగా, ప్రస్తుతం కేవలం రూ74,202 లు మాత్రమే ఉన్నాయి. అలాగే వేమన రెండు ఖాతాలకు సంబంధించి ఒక ఖాతాలో రూ.3 వేలు, మరో ఖాతాలో రూ.4వేలు తేడా కనబడుతోంది. గతంలోనూ ఓ కానిస్టేబుల్ ఖాతా నుంచి సైతం నగదు మాయమైంది. పలువురి ఖాతాలు పరిశీలించగా, కొన్నింటిలో నగదు మాయమైనట్లు గమనించారు. ఐతే కొందరు మాత్రమే తమ ఖాతాలను పోస్టాఫీసులో చెక్ చేయించుకోగా, రెండు వందల మందికి పైగా ఖాతాలను పరిశీలించాల్సి ఉన్నట్లు తెలుస్తోంది. బీపీఎం స్వాహా చేసిన సొమ్ములు తిరిగి చెల్లించినప్పటికీ, తమకు రావాల్సి వడ్డీ నష్టపోయామని ఖాతాదారులు ఏఎస్పీను ప్రశ్నించారు. స్వాహా చేసిన వాటిలో రూ.50వేల నగదును బీపీఎం తిరిగి చెల్లించేందుకు మంగళవారం బ్రాంచి పోస్టాఫీసుకు రాగా, పూర్తిగా లెక్కలు చూసిన తర్వాత కట్టించుకుంటామని ఏఎస్పీ తెలిపినట్లు సమాచారం.

ఖాతాదారులు ఆందోళన చెందొద్దు.. ఏఎస్పీ సుచేందర్

ఖాతాదారుల సొమ్మును మాయం చేసినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న బీపీఎం శ్రీనివాసును సస్పెండ్ చేశామని ఏఎస్పీ సుచేందర్ తెలిపారు. సేవింగ్స్ బుక్‌లో జమ చేసిన పోస్టింగ్, బ్రాంచి స్టాంపు పడిన ప్రతీ ఒక్క ఖాతాలో మాయమైన నగదును రికవరీ చేసి ఇస్తామని పేర్కొన్నారు. ఎవరూ ఆందోళన చెందవద్దని, ఖాతాల్లో డబ్బులు కట్టిన ప్రతీ ఒక్కరూ విధిగా పుస్తకంపై స్టాంపు వేయించుకోవాలని సూచించారు. అలా స్టాంపు వేసిన ప్రతీ ఒక్క రూపాయికు తమ భరోసా ఉంటుందన్నారు.

కాల్వలో పడి వ్యక్తి మృతి

దుమ్ముగూడెం మార్చి 19: తాలిపేరు ప్రధాన కాల్వలో పడి వ్యక్తి మృతి చెందిన సంఘటన సుబ్బారావుపేట వద్ద జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ధర్మారం కొత్తగూడేనికి చెందిన కారం తిరుపతిరావు(45) ఈనెల 18న ద్విచక్ర వాహనంపై ఇంటి నుంచి వెళ్లిన తిరుపతిరావు ఆ రోజంతా ఇంటికి వెళ్లలేదు. ఈనెల 19న ఉదయం వాహనంతో సహా తాలిపేరుకాల్వలో మృతి చెంది పడి ఉండడాన్ని స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. తిరుపతిరావు అక్క సుబ్బారావుపేటలో నివసిస్తుండగా, ఆమె వద్దకు వెళ్లి తిరిగి వస్తున్న క్రమంలో ప్రమాదం జరిగి ఉంటుందని కుటుంబ సభ్యులు భావిస్తున్నారు. తన భర్త మద్యం తాగుతాడని, అలాగే మూర్ఛవ్యాధి కూడా ఉందని, ద్విచక్రవాహనం నడుపుతున్న క్రమంలో మద్యం మత్తులో మూర్ఛ వచ్చి కాల్వలో పడి ఉంటాడని భార్య మీనా పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఎస్ఐ కేశవరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చెరువులో పడి వ్యక్తి..

చింతకాని, మార్చి 19: మండల పరిధిలోని వందనం గ్రామానికి చెందిన అమరోజు వీరారెడ్డి (50) మృతదేహాన్ని గంగమ్మగుడి సమీపంలోని చెరువులో మంగళవారం కుటుంబ సభ్యులు గుర్తించారు. వీరారెడ్డి మూడు రోజులుగా కనబడకపోవడంతో కుటుంబీకులు వెతికే పనిలో ఉన్నారు. చెరువు వద్దకు వెళ్లి ప్రమాదవశాత్తు నీట మునిగి చనిపోయినట్లు స్థానికులు భావిస్తున్నారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

తమ్మిలేరు వాగులో పడిన లారీ

సత్తుపల్లిరూరల్, మార్చి19: అదుపుతప్పి లారీ తమ్మిలేరు వాగులోకి బోల్తాపడిన సంఘటన మంగళవారం సత్తుపల్లిలో చోటు చేసుకుంది. పట్టణ సీఐ కిరణ్ తెలిపిన వివరాల ప్రకారం..అశ్వారావుపేట వైపు నుంచి కె మికల్ లోడ్‌తో వస్తున్న లారీ పట్టణ శివారులోని తమ్మిలేరు బ్రిడ్జి వద్ద అదుపుతప్పి వాగులోకి బోల్తా కొట్టింది. నీటిలో మునిగిన లారీ క్యాబిన్‌లో నుంచి డ్రైవర్ వెంటనే బయటకు రావడంతో ప్రాణాపాయం తప్పింది. పోలీసులకు సమాచారం అందించాడు. అనంతరం క్రెయిన్ సహాయంతో లారీని పోలీసులు బయటకు తీయించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

దుమ్ముగూడెం మార్చి 19: ప్రమాదం జరిగి గాయాలతో రోడ్డు మీద పడి ఉన్న యువకుడిని హుటాహుటిన ఆసుపత్రిలో చేర్చి మానవత్వం చాటుకున్నారు పర్ణశాల క్రీడాకారులు. వాజేడు మండల ఎడ్జెర్లపల్లికి చెందిన గణేష్ అనే యువకుడు ద్విచక్రవాహనంపై ప్రయాణిస్తూ పెదార్లగూడెం ఆర్‌అండ్‌బీ ప్రధాన రహదారిపై మంగళవారం కింద పడ్డాడు. తీవ్ర గాయాలతో స్పృహ తప్పి పడి ఉన్న గణేష్‌ను మారాయిగూడెంలో క్రికెట్ ఆటకు వెళ్లి తిరిగి వస్తున్న పర్ణశాల క్రీడాకారులు అతడిని చూసి 108 వాహనానికి ఫోన్ చేయడంతోపాటు, దానికి ఎదురుగా కొంతదూరం తమ ఆటోలో తీసుకెళ్లారు. సిబ్బంది ప్రాథమిక చికిత్సలు నిర్వహించి భద్రాచలం ఏరియా ఆసుపత్రికి తరలించగా, పరిస్థితి నిలకడగా ఉన్నట్లు తెలుస్తోంది. సాయం చేసిన వారిలో తెల్లం హరికృష్ణ, వాగే భరత్‌కుమార్, శివకుమార్, దుర్గ, తరుణ్‌రెడ్డి, శివారం, సందీప్‌రెడ్డి, చరణ్, అభిరాం, విజయ్‌లున్నారు.

భర్తకు నిప్పంటించిన భార్య అరెస్టు

ఖమ్మం క్రైం, మార్చి19: చెవిదిద్దులు కొనివ్వలేదని భర్తపై భార్య టర్పెంటాయిల్ పోసి నిప్పంటించిన కేసులో భార్యను ఖమ్మం వన్‌టౌన్ పోలీసులు మంగళవారం అదుపులోకి తీసుకున్నారు. నగరంలోని నిజాంపేటకు చెందిన షేక్. యాకూబ్‌పాషాపై ఇటీవల అతని భార్య సమీనా చెవిదిద్దులు కొనివ్వలేదని క్షణికావేశంలో టర్పెంటాయిల్‌పోసి నిప్పంటించింది. ఈ ఘటనపై గాయపడిన వ్యక్తి తల్లి ఆశ వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఆమెపై పోలీసులు హత్యాయత్నం కేసు నమోదు చేసి మంగళవారం న్యాయస్థానంలో హాజరుపరిచారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

మణుగూరురూరల్, మార్చి 19: మణుగూరు మండలంలోని కొండాయిగూడెం గోదావరి నది నుంచి అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న 9 ట్రాక్టర్లను, ఒక ఎక్స్‌కవేటర్‌ను తహశిల్దార్ రాఘవరెడ్డి మంగళవారం పట్టుకున్నారు. ఒక్కోక్క ట్రాక్టర్ యాజమానులకు రూ.5 వేల చొప్పున రూ.45 వేలు, ఎక్స్‌కవేటర్‌కు రూ.25 వేలు జరిమానా విధించారు.

లారీ నుంచి జారీ పడిన జామాయిల్ కర్రలు

● తప్పిన ప్రమాదం

మణుగూరుటౌన్, మార్చి19: మణుగూరు ప్రధాన రహదారి మీదుగా నిత్యం రాకపోకలు సాగిస్తోన్న జామాయిల్ కర్రలోడ్ లారీలు, ట్రాక్టర్లు ప్రజలను ఆందోళనకు గురిచేస్తున్నాయి. లారీ, ట్రాక్టర్ బాడీ లెవల్‌కు అధికంగా బాగా ఎత్తుగా కర్రను లోడ్ చేసుకుని ప్రధాన రహదారిపై లారీలు ప్రజలను ఆందోళనకు గురిచేస్తున్నాయి. జామాయిల్ కర్ర ఎక్కడ జారీ మీద పడుతుందోనని భయాందోళనలకు గురవుతున్నారు. ఈ క్రమంలో మంగళవారం మణుగూరు పట్టణంలో మంగళవారం ఉదయం సమయంలో ప్రధాన రహదారిపై ప్రమాదభరితంగా జామాయిల్ కర్రలోడ్‌తో వెళ్తున్న లారీ నుంచి కర్రలు జారీ రహదారిపై పడుతుండగా.. మరో వైపు రహదారిపై స్కూల్ బస్సు, ఆటోలు, ద్వి చక్రవాహనదారులు ఆందోళనకు గురయ్యారు. కాగా ఎవ్వరికి ఎటువంటి ప్రమాదం జరగకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు.

వన్యప్రాణులకు రక్షణ కరువు

- అర్బన్ పార్క్‌లో చనిపోతున్న చుక్కల దుప్పులు
- పార్క్‌లోకి విచ్చలవిడిగా చొరబడుతున్న వీధి కుక్కలు
- బాధ్యతను విస్మరిస్తున్న అటవీ శాఖ



వీధికుక్కల దాడిలో చనిపోయిన దుప్పి (ఫైల్)

సత్తుపల్లి, మార్చి 19: సత్తుపల్లి పట్టణంలో రిజర్వ్ ఫారెస్ట్ ఆధా రంగా ఏర్పాటు చేసిన 'నీలాద్రి అర్బన్ పార్క్'లో వన్యప్రాణులకు రక్షణ కరువైంది. ప్రతిఏటా అర్బన్‌పార్క్ లో ఉన్న చుక్కల దు ప్పులు పలు కారణాలతో మృత్యువాత పడుతున్నాయి. వాటికి రక్షణ కల్పించే విష యంలో అటవీ శాఖ మీనమేషాలు లెక్కిస్తుందనే ఆరోపణలు వెల్లువెత్తు తున్నాయి. పార్క్‌కు పడమర వైపున సింగరేణి బొగ్గుగని కారణంగా ఇబ్బందులు వస్తున్నాయని అటవీ శాఖ చెబుతుండగా అది తమకు సంబంధం లేదని సింగరేణి సంస్థ అధికారు లు చెబుతున్నారు. పార్క్‌లోకి విచ్చలవిడిగా వీధి కుక్కలు చొరబడి చుక్కల దుప్పులపై దాడులుచేసి గాయపరుస్తుండటంతో చనిపోతున్నాయి.

390ఎకరాలలో అర్బన్ పార్క్

సత్తుపల్లి పట్టణంలోని వేంసూర్ రోడ్డులో 390ఎకరాల రిజర్వ్ ఫారెస్ట్ భూమిలో అర్బన్ పార్క్‌ను ఏర్పాటు చేయాలని 2018లో నిర్ణయించారు. కాలక్రమంలో పార్క్‌ను అభివృద్ధి చేశారు. దీనికి సింగరేణి సంస్థ, సత్తుపల్లి మునిసిపాలిటీ అటవీ శాఖల నిధులు ఖర్చు చేశారు. పార్క్‌కు రెండు వైపులా ఇనుప్ మెస్‌తో కూడిన ఫెన్సింగ్‌ను ఏర్పాటు చేశారు. పార్క్‌కు పడమర వైపున సింగరేణి ఓపెన్ కాస్ట్ డంపింగ్ గుట్ట ఉండటంతో ఫెన్సింగ్ ఏర్పాటు చేయలేదు. పార్క్‌లో రహదారులు నిర్మించి వన్యప్రాణుల కోసం నీటి చెరువులను తవ్వించారు. వాచ్ టవర్ నిర్మించారు. పార్క్‌ను పర్యాటక ప్రదేశంగా తీర్చిదిద్దినప్పటికీ వన్యప్రాణులకు సరైన రక్షణ కల్పించలేకపోయారు.

వరుసగా మృత్యువాత పడుతున్న చుక్కల దుప్పులు

అర్బన్ పార్క్‌ను సందర్శకులకు, వాకర్స్‌కు అనుకూలంగా తీర్చిదిద్దినప్పటికీ వన్యప్రాణులకు రక్షణ చర్యలు మాత్రం అంతంతమాత్రంగా ఉన్నాయని విమర్శలు ఉన్నాయి. సాధారణంగా వన్యప్రాణుల రక్షణకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాల్సిన అటవీశాఖ అధికారులు పటిష్ఠ చర్యలు తీసుకోకపోవడంతో చుక్కల దుప్పులు చనిపోతున్నాయి. పార్క్‌లో 300 వరకు చుక్కల దుప్పులు ఉంటాయని అంచనా. పార్క్‌లోకి వెంగళరా వునగర్, జలగం నగర్ సమీప ప్రాంతాల నుంచి వీధి కుక్కలు ప్రవేశించి దుప్పులపై దాడి చేస్తున్నాయి. తీవ్రంగా గాయపడిన దుప్పులకు పశు సంవర్థకశాఖ ఆధ్వర్యంలో చికిత్స చేసి కిన్నెరసానిలోని అభయారణ్యంలోకి పంపుతున్నారు. కొన్ని దుప్పులు వైద్య సహాయం అందించేలోపే చనిపోతున్నాయి. కొన్ని దుప్పులు పార్క్ నుంచి బయ టకు వచ్చి రోడ్డు ప్రమాదంలో చనిపోగా ఒక దుప్పి గతేడాది వెంగళ రావు నగర్ నివాస ప్రాంతంలోకి వచ్చి బావిలో పడి చనిపోయిన సంఘటన చోటుచేసుకుంది. ఇలా పలు రకాల కారణాలతో దుప్పులు నిత్యం మృత్యువాత పడటం రివాజుగా మారింది.

తక్షణ రక్షణ చర్యలు అవసరం

వన్యప్రాణులను కాపాడేందుకు అధికారులు యుద్ధప్రాతిపదికన రక్షణ చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని జంతు ప్రేమికులు డిమాండ్ చేస్తున్నారు. పదుల సంఖ్యలో దుప్పులు పలు కారణాలతో మృత్యువాత పడుతున్నా ఇప్పటివరకు పటిష్ఠమైన చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. పార్క్ బయట నుంచి వీధి కుక్కలు పార్క్‌లోకి రావడం, పార్క్‌లోని దుప్పులు బయటకు పోవడాన్ని నియంత్రించే చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. ఫెన్సింగ్ లేని ప్రాంతాలలో బయట నుంచి వీధి కుక్కలు లోపలికి రాకుండా అవసరమైన చర్యలు తీసుకోవాల్సి ఉంది. కానీ సింగరేణి సంస్థ సిబ్బంది, అటవీ శాఖ సిబ్బంది పార్క్‌లో గస్తీ తిరుగుతున్నామంటూ అధికారులు చెబుతున్నారు. 390ఎకరాల అటవీ విస్తీర్ణంలో గస్తీ తిరగడం వలన ఏ మేరకు ఫలితం ఉంటుందనేది ప్రశ్నార్థకం. సింగరేణి సంస్థ ఓపెన్ కాస్ట్ పడమర వైపు ఉన్న కారణంగా ఫెన్సింగ్ వేయలేకపోతున్నామని అటవీ అధికారులు చెబుతున్నా దానిని సింగరేణి అధికారులు ఖండిస్తున్నారు. మొత్తంగా ఉన్నతాధికారులు పరిస్థితిని సమీక్షించి మరిన్ని దుప్పులు మృత్యువాత పడకుండా అవసరమైన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.



నీలాద్రి అర్బన్ పార్క్



గాయపడిన చుక్కల దుప్పికి చికిత్స అందిస్తున్న పశువైద్యులు

2.8కిలోమీటర్ల ఫెన్సింగ్ నిర్మిస్తాం: వెంకటేశ్వరరావు ఎఫ్‌బీవో

అర్బన్ పార్క్‌లో ఫెన్సింగ్‌లేని 2.8కిలోమీటర్ల పొడవున పటిష్ఠమైన ఫెన్సింగ్ నిర్మించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. అప్పటి వరకు సిబ్బందితో అర్బన్ పార్క్‌లో గస్తీ తిరిగి వీధి కుక్కలను రాకుండా చూస్తున్నామన్నాం.

తాగునీటికి ఇబ్బందులు రావొద్దు

- ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలి
- అధికారులకు కలెక్టర్ గౌతమ్ ఆదేశం

ఖమ్మం కలెక్టరేట్, మార్చి 19: జిల్లాలో తాగునీటికి ఇబ్బందులు లేకుండా అన్ని చర్యలు చేపట్టాలని ఖమ్మం కలెక్టర్ గౌతమ్ ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ లోవీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి ఎంపీడీవో, పీఆర్, ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజనీర్లతో తాగునీటి సరఫరాపై కలెక్టర్ సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ, జలాశయాల్లో నీటి లభ్యత తగ్గుతున్నందున రాబోయే రోజుల్లో తాగునీటి సమస్యలు తలెత్తకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలన్నారు. జిల్లాలో పట్టణ ప్రాంత పరిధిలో 804 బోర్లు, 151 పంపులు పనిచేస్తున్నట్లు, గ్రామీణ ప్రాంత పరిధిలో 1627 బోర్లు, 7199 పంప్ లు అందుబాటులో ఉన్నాయన్నారు. వేసవి తీవ్రత దృష్ట్యా ముందు ముందు ఏ ఏ ప్రాంతాల్లో ఎంత మేర నీటి లభ్యత ఉంటుందో, ఇబ్బందులు తలెత్తకుండా చేపట్టాల్సిన చర్యలపై కార్యాచరణ చేయాలన్నారు. బోర్ల మరమ్మతులు చేయాలని, ప్రైవేటు బావులు, నీటి వనరులను లీజుకు తీసుకోవాలన్నారు. నీటి వనరులు ఉన్న గ్రామాల్లో సరిపోను ఉన్నాయా లేవా అనే అంశాలను పరిశీలించాలన్నారు. తాగునీటి సరఫరా విషయమై మంజూరు పనులు యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలన్నారు. బోర్‌వెల్ ఆపరేటర్లు అనుమతి లేకుండా ప్రయివేటు బోర్లు వేస్తే వాల్టా చట్టం ప్రకారం చర్యలు తీసుకోవాలని ఆయన తెలిపారు. క్రొత్త బోర్ల మంజూరు విషయమై నిబంధనలు పాటించాలని ఆయన అన్నారు. గత సంవత్సరం నీటి ఎద్దడిని ఎదుర్కొన్న గ్రామాలలో సమస్య పునరావృతం కాకుండా చూడాలని, ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలన్నారు. మిషన్ భగీరథ ఏఈలు క్షేత్ర స్థాయిలో గ్రామాలు తిరిగి త్రాగునీటి సరఫరాలో ఉత్పన్నమయ్యే సమస్యలను ఎప్పటికప్పుడు గుర్తించి సరిచేయాలని అన్నారు. తాగునీటి ఎద్దడి కల్గకుండా అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు బి. సత్యప్రసాద్, డి. మధుసూదన్ నాయక్, ఖమ్మం నగరపాలక సంస్థ కమిషనర్ ఆదర్శ్ సురభి, శిక్షణా సహాయ కలెక్టర్ మయాంక్ సింగ్, మిషన్ భగిరథ ఎస్ఈ సదాశివ కుమార్, పీఆర్ ఎస్ఈ చంద్రమౌళి, జడ్పి సీఈవో వినోద్, డీపీవో హరికిషన్, సీపీవో శ్రీనివాస్, పబ్లిక్ హెల్త్ ఈఈ రంజిత్, మిషన్ భగిరథ ఈఈ పుష్పలత, వాణిశ్రీ తదితరులు పాల్గొన్నారు.



వీడియోకాన్ఫరెన్స్ ద్వారా జిల్లా అధికారులకు సూచనలు ఇస్తున్న కలెక్టర్

25 నుంచి ఓపెన్ పరీక్షలు

ఖమ్మం సాంస్కృతికం/కొత్తగూడెం కలెక్టరేట్, మార్చి 19: ఓపెన్ పదవతరగతి, ఇంటర్మీడియేట్ పరీక్షలు ఈనెల 25 నుంచి మే 2వ తేదీవరకు రెండు సెషన్స్‌లలో నిర్వహిస్తున్నట్లు ఖమ్మం, భద్రాద్రి జిల్లాల డీఈవోలు సోమశేఖరశర్మ, వెంకటేశ్వరచారి ఉమ్మడిజిల్లా కోఆర్డినేట్ మద్దినేని పాపారావు ఓ ప్రకటనలో తెలిపారు. పరీక్షలు ఉదయం 9 గంటలనుంచి మధ్యాహ్నం 12 గంటలవరకు ఒక సెషన్ కాగా రెండవ సెషన్ మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30వరకు జరుగుతాయని పేర్కొన్నారు. ఇంటర్మీడియేట్ ప్రాక్టికల్ పరీక్షలు మే 3వ తేదీనుంచి 10 వరకు జరుగుతాయన్నారు.

ఖమ్మం జిల్లా జనరల్ ఆస్పత్రిలో 38 పోస్టుల భర్తీ

వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రాజేశ్వరరావు

ఖమ్మం కలెక్టరేట్, మార్చి 19: ప్రభుత్వ వైద్య కళాశాల, జిల్లా ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేసినట్లు మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రాజేశ్వరరావు తెలిపారు. ఈనెల 13న వెల్లడించిన నోటిఫికేషన్ ఆధారంగా మొత్తం 101 పోస్టులకు గాను 66 దరఖాస్తులు అందినట్లు తెలిపారు. వీటిలో అర్హులైన 38 మందిని ఎంపిక చేసినట్లు తెలిపారు. వీరిలోనూ 32 మంది మంగళవారం నాటికి రిపోర్టు చేశారని మరో 6గురు విధుల్లో చేరాల్సి ఉందన్నారు. అయితే సూపర్ స్పెషాలిటీకి చెందిన మూడు పోస్టులను డీఎంఈ రద్దు చేసినట్లు తెలిపారు. వీరంతా బుధవారం నాటికి పూర్తిస్థాయిలో చేరనున్నట్లు ఆయన తెలిపారు.

దంతెలబొర ఎస్సీ కాలనీ హెల్త్ సబ్‌సెంటర్ నిర్మించాలి

మంత్రి రాజనర్సింహకు కాంగ్రెస్ నాయకుడి వినతి



మంత్రికి వినతిపత్రం అందజేస్తున్న నాయకుడు

పాల్వంచ రూరల్, మార్చి 19: దంతెలబొర ఎస్సీ కాలనీలో హెల్త్ సబ్‌సెంటర్ నిర్మించాలని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహకు మంగళ వారం కాంగ్రెస్ మండల నాయకులు, దంతెలబొర ఎస్సీ కాలనీ మాజీ సర్పంచ్ గద్దల రమేష్ హైదరాబాద్‌లో వినతిపత్రం అందజేశారు. గిరిజన మారుమూల ప్రాంతాలైన దంతెలబొర, ఎస్సీ కాలనీ, గంగాదేవిగుప్ప, సంగం గ్రామాల ప్రజలు జగన్నాథపురం చాలా వ్యయ ప్రాయాసలు పడి ప్రజలు పీహెచ్‌సీకి వెళ్లాల్సి వస్తుందన్నారు. దంతెల బొర ఎస్సీ కాలనీలో హెల్త్ సబ్‌సెంటర్ నిర్మిస్తే ప్రజలకు ఉపయోగకరంగా ఉంటుందని కోరారు. ఇందుకు మంత్రి సానుకూలంగా స్పందించి హెల్త్ సబ్‌సెంటర్‌కు హామీ ఇచ్చారని తెలిపారు.

వ్యవసాయ కళాశాల విద్యార్థుల క్షేత్ర సందర్శన



నర్సరీలోని మొక్కల గురించి తెలుసుకుంటున్న వ్యవసాయ కళాశాల విద్యార్థులు

అశ్వారావుపేట రూరల్, మార్చి 19: అశ్వారావుపేట వ్యవసాయ కళాశాల విద్యార్థులు మంగళవారం ఖమ్మం జిల్లాలోని సత్తుపల్లి మండలం నారాయణపురంలో గల ఎస్‌కేఎస్‌బీ నర్సరీని సందర్శించారు. ద్వితీయ సంవత్సరం విద్యార్థులు తమ క్షేత్రసందర్శనలో భాగంగా కార్యక్రమాన్ని చేపట్టారు. నర్సరీలో పెంచుతున్న వివిధ రకాల మొక్కలు, వాటిని పెంచే విధానం గురించి తెలుసుకున్నారు. ప్రధానంగా నర్సరీలో పెంచిన వక్క, అరటి, జాజిపత్రి, కాశ్మీర్ ఆపిల్‌తో పలు రకాల మొక్కల పెంపకాలు, పంట సాగుతో లాభాలను అడిగి తెలుసుకున్నారు. ఉద్యాన పంటల్లోని లోటుపాట్లు, యాజమాన్య పద్ధతులు, సాగు విధానాలను నర్సరీ యజమాని బాజి వివరించారు. అసోసియేట్ డీన్ డాక్టర్ హేమంత్‌కుమార్, సహాయ ఆచార్యులు డాక్టర్ నీలిమ ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

జెన్కో ఇంటర్ ప్రాజెక్ట్ క్రీడా పోటీలు ప్రారంభం

పాల్వంచ, మార్చి 19: రాష్ట్రస్థాయిలో నిర్వహించు టీఎస్ జెన్కో ఇంటర్ ప్రాజెక్ట్ వాలీబాల్, లాన్ టెన్నీస్ పోటీలు మంగళవారం పాల్వంచ కేటీపీఎస్ కాంప్లెక్స్‌లో ప్రారంభమయ్యాయి. 5,6దశల స్పోర్ట్స్ కౌన్సిల్ ఆద్వర్యంలో నిర్వహిస్తున్న ఈ క్రీడా పోటీలను సీఈలు ప్రభాకరరావు, వెంకటేశ్వరరావు, శ్రీనివాసబాబు ప్రారంభించారు. మూడు రోజుల పాటు కొనసాగే ఈ టోర్నమెంట్‌లో బూపాలపల్లి, పోచంపాడు, రామగుండం, విద్యుత్ సౌధా, జూరాల, పులిచింతల, మణుగూరు, శ్రీశైలం, నాగార్జునసాగర్, కేటీపీఎస్ 7వ దశ, కేటీపీఎస్ 5,6దశల జట్లు పాల్గొన్నాయి.

లంబాడీలకు ఎస్టీ హోదా రాజ్యాంగ విరుద్ధం

- తుడుందెబ్బ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ అరుణ్‌కుమార్

ఇల్లెందు, మార్చి 19: రాజకీయ అధిపత్యం, ఆర్థిక వనరులను గుప్పిట్లో పెట్టుకొని అంబాడీలు రాజ్యాంగ విరుద్ధంగా ఎస్టీ హోదా పొందుతున్నారని ఆదివాసీల హక్కులు, సామాజిక న్యాయం కోసం పోరాడుతున్నట్టు తుడుందెబ్బ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఖైపతి అరుణ్‌కుమార్ తెలిపారు. మంగళవారం ఇల్లెందులో జరిగిన విలేకర్ల సమావేశంతో ఆయన మాట్లాడుతూ మహబుబాబాద్ లోక్‌సభ నియోజకవర్గంలో కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు ఆదివాసులను నిర్లక్ష్యం చేస్తు లంబాడీలకే టికెట్ కేటాయించారని విమర్శించారు. ఆదివాసుల ఆత్మగౌరవం కోసం ఎన్నికల్లో పోటి చేయాలని తుడుందెబ్బ నిర్ణయించిందన్నారు. రాజ్యాంగాన్ని సవరించకుండా లంబాడీలను ఎలా ఎస్టీలుగా గుర్తిస్తారన్నారు. లంబాడిలను ఎస్టి జాబితా నుంచి తొలగించాలని ప్రధాన డిమాండ్‌తోనే తాము ఎన్నికల్లో పోటిచేస్తున్నమని తెలిపారు. నాలుగు లక్షల ఓటు బ్యాంకు కలిగిన ఆదివాసులు ప్రధాన పార్టీలకు వ్యతిరేకంగా తుడుందెబ్బను గెలుపించుకోవాలన్నారు. ఆదివాసీ యువత మహబుబాబా ద్ లోక్‌సభ నియోజకవర్గాన్ని ఆదివాసీ ఆత్మగౌరవ యుద్ధ క్షేత్రంగా బావించాలని ఓటును ఆయుదంగా మార్చుకొని లంబాడిలను నుండి విముక్తి పొందాలని పిలుపు నిచ్చారు. ఈసమావేశంలో తుడుందెబ్బ జిల్లా అధ్యక్షులు సనప కోటేశ్వరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి మోకాళ్ల సతీష్, ఎట్టి శ్రీనివాసరావు, పోదెం రాంమూర్తి, కల్తి రాంప్రసాద్, ఈసాల రాంబాబు, తాటి మల్లయ్య పాల్గొన్నారు.

గోశాలకు రూ. ఐదు లక్షల విరాళం

భద్రాచలం మార్చి 19: భద్రాచలానికి చెందిన పసుమర్తి లక్ష్మి కుమారి ఆమె కుమారులు, కోడళ్లు దిలీప్ శ్రీలక్ష్మి, బాలాజీ శరణ్య గోశాల వద్ద కంటైనర్ నిర్మాణానికి రూ.ఐదు లక్షలు విరాళం అందజేశారు. తన భర్త పసుమర్తి రామారావు జ్ఞాపకార్థం ఈ మొత్తాన్ని భద్రాచలంలోని ఈవో కార్యాలయంలో మంగళవారం దేవస్థానం ఈవో రమాదేవికి అందజేశారు. శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం కు చెందిన ఏపీలోని పురుషోత్తప ట్నం శ్రీ గోకులరామంలో ఉన్న గోశాల వద్ద కంటైనర్ నిర్మాణానికి రూ. ఐదు లక్షల విరాళాన్ని వినియోగించనున్నారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం ఇంజనీరింగ్ విభాగం ఈఈ రవీంద్రనాథ్, సీసీ శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు.

మిషన్ భగీరథ నీరు వృథా



మాచినేనిపేటతండా వద్ద ఎయిర్ వాల్ నుంచి వృథాగా పోతున్న నీళ్లు

జూలూరుపాడు, మార్చి19: మండలంలోని మాచినేనిపేటతండా గ్రామ సమీపంలో మిషన్ భగీరథ నీరు వృథాగా పోతున్నా పట్టించుకొనే వారే కరువయ్యారు. గ్రామాలలోని ప్రజలకు భగీరథ నీటిని సరఫరా చేసేందుకు ఏర్పాటు చేసిన ఎయిర్ వాల్‌కు రంధ్రం పడటంతో నీరు వృథాగా పోతుంది. దీంతో గ్రామాలలోని ప్రజలకు నీటి సరఫరాలో అవాంతరాలు కలుగుతున్నాయి. గత కొన్ని రోజుల క్రితం ఎయిర్ వాల్‌కి రంధ్రం పడి నీరు వృధాగా పోతున్నా ఆ శాఖ అధికారులు మరమ్మతులు చేపట్టకపోవడం ప్రజలను విస్మయానికి గురిచేస్తుంది ఇప్పటికైనా ఎయిర్ వాల్‌కు మరమ్మతులు చేపట్టి నీటి సరఫరాలో కలుగుతున్నా అవాంతరాలను తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

అహ్మద్ సేవలు అభినందనీయం

- టీజీఆర్టీసీ ఎండీ సజ్జనార్



అహ్మద్‌ను సత్కరిస్తున్న సజ్జనార్

పాల్వంచ టౌన్, మార్చి 19: పాల్వం చ పట్టణంలో నేతాజీయువజన సంఘం ద్వారా ఎన్నో సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న ఎస్‌జేకే. అహ్మద్ సేవలు అభినందనీయమని టీజీఆర్టీసీ ఎండీ సజ్జనార్ అన్నారు. మంగళవారం హైదరాబాద్‌లోని బస్‌భవన్‌లో అహ్మద్‌ను ఆయన ఘనంగా సత్కరించారు. ఆయన మాట్లాడుతూ అహ్మద్ బృందం కరోనా కష్టకాలంలో పేదలను ఆదుకున్న తీరు ప్రశంసనీయమన్నారు. అహ్మద్ భవిష్యత్‌లో ఇంకా మరెన్నో సేవా కార్యక్రమాలు నిర్వహించాలని ఆకాంక్షించారు.

ఆహ్లాదం పంచని పట్టణ ప్రకృతివనం

- నిర్వహణ అధ్వానం.. ఆచరణ శూన్యం
- మద్యంపానం, ధూమపానానికి అడ్డాగా ప్రకృతివనం
- శిథిలమైన పార్క్‌లోని పరికరాలు
- నిరాధరణకు గురవుతున్న కాకర్లపల్లి సమీపంలోని పట్టణ ప్రకృతివనం

సత్తుపల్లిరూరల్, మార్చి 19: గత ప్రభుత్వం ఆహ్లాదం కోసం ప్రతి వార్డుకు, గ్రామానికో ప్రకృతి వనాన్ని ఏర్పాటు చేయించింది. ప్రజలకు అందుబాటులో ఉండి ఆహ్లాద భరితమైన వాతావరణాన్ని అందించేందుకు ఏర్పాటు చేసిన పల్లె ప్రకృతి వనాలు కొన్ని జనావాసాల సమీనంలో ఉండగా మరొకొన్ని ఊరికి దూరంగా ఉండటంతో నిర్వహణ భారంగా మారుతున్నాయి. సత్తుపల్లి మునిసిపాలిటీ పరిధిలోని కాకర్లపల్లి రోడ్డులో గతంలో ఏర్పాటుచేసిన పట్టణ ప్రకృతివనం నిర్వహణ ఆధ్వానంగా ఉండటంతో ఆహ్లాదం అందని వైనమిది. నీటి సౌకర్యాలు లేక మొక్కలు ఎండిపోయి కళావిహీనంగా మారాయి. విద్యుత్ సౌకర్యం కల్పించాల్సిన ఉన్నప్పటికీ పూర్తిస్థాయిలో ఏర్పాటు చేయడం లేదు. ఎకరం స్థలం ఉన్న ప్రకృతివనాల్లో సుమారు 4వేల మొక్కలను నాటాల్సి ఉండగా, చిన్న స్థలాలు ఉన్నచోట్ల 2వేల మొక్కలను నాటాల్సి ఉంది. నీటి వసతి లేనిచోట ట్యాంకర్ల ద్వారా మొక్కలకు నీటి వసతి కల్పించాల్సి ఉంది. మొక్కలు ఎండిపోయిన చోట కొత్త మొక్కలు నాటేలా చర్యలు చేపట్టాల్సి ఉంది. వాతావరణానికి హాని తలపెట్టే కోనోకార్పస్ మొక్కలు మాత్రం ఏపుగా పెరిగాయి.

సేద తీరేందుకు అవకాశం లేక...

పట్టణానికి కాస్తంత దూరంగా ఉండే ఈ ప్రకృతివనంలో పచ్చదనం లేక నిరాధరణకు గురవుతుంది. ప్రారంభించిన కొత్తలో ఉదయం, సాయంత్రం వేళల్లో వాకింగ్ చేసేవాళ్ళతో కళకళలాడగా నిర్వహణ లోపంతో క్రమేణా నిరాధరణకు గురైంది. నీటి సరఫరా లేక చెట్లు ఎండిపోగా మొక్కలు చచ్చిపోయాయి. పిల్లల కోసం ఏర్పాటుచేసిన ఆట పరికరాలు తుప్పుపట్టాయి. విద్యుత్ సౌకర్యం లేకపోవడంతో రాత్రిళ్లు వనంలో చీకటి నెలకొంటుంది. ఉదయం, సాయంత్రం వేళల్లో సేదతీరడానికి కాదుకదా అటువైపుగా వెళ్లాలంటే జంకే పరిస్థితి నెలకొందని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఎందుకంటే పగలూ రాత్రీ తేడా లేకుండా అసాంఘీక కార్యకలాపాలకు ఇది అడ్డాగా మారిందంటూ కథనాలు ప్రజల నోట వినిపిస్తున్నాయి. పరిశ్రమల రాకతో వాతావరణంలో అసమతౌల్యత కారణంగా వేడి ఎక్కువ అవుతుందని, వేసవి కాలం కావడంతో వెచ్చదనాన్ని తగ్గించే పచ్చదనం ప్రకృతి వనాల ద్వారానైనా చల్లదనం పెంచే అవకాశం ఉండగా ఇలా నిర్లక్ష్యానికి గురైన ప్రకృతి వనాలను పునఃరుద్ధరించి ఆహ్లాదం పంచాలని ప్రజలు కోరుతున్నారు.

దూమపానం, మద్యంపానం అడ్డుకోవడం మా పనికాదు

మందా రవిబాబు, మునిసిపల్ కమిషనర్, సత్తుపల్లి



ఇటీవల నిరాధరణకు గురైన పట్టణ ప్రకృతి వనాన్ని సందర్శించా. చనిపోయిన మొక్కల స్థానంలో కొత్త మొక్కలు నాటుతాం. దూమపానం, మద్యపానం అడ్డుకోవడం మా పని కాదు. గేట్‌కు తాళం వేసినప్పటికీ గోడ దుమికి వెళ్తున్నారు. ప్రజలకు ప్రకృతి వనాన్ని అందుబాటులోకి త్వరలోనే తీసుకువస్తాం.







ఆటస్థలంలో తుప్పుపట్టిన పరికరాలు, మందుసీసాలు, సిగరెట్ ప్యాకెట్లు, నిరాధరణకు గురైన పట్టణ ప్రకృతివనం

హక్కుల కోసం ఐక్యంగా ఉద్యమించాలి

- తెలంగాణ కోసం పోరాడిన ఉద్యోగ సంఘాలకు గుర్తింపు కరువు
- టీజీవో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఏలూరి శ్రీనివాసరావు

కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్, మార్చి 19: రాష్ట్రంలో పనిచేస్తున్న ప్రభుత్వ ఉద్యోగులందరూ తమ హక్కులను సాధించుకోవాలని, అందుకోస ఐక్యంగా పోరాడాలని తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం (టీజీవో) రాష్ట్ర అధ్యక్షుడు ఏలూరి శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. కొత్తగూడెం క్లబ్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో ప్రభుత్వ ఉద్యోగులందరూ జేఏసీగా ఏర్పడి ముందు వరుసలో నిలబడి పోరాడారని గుర్తు చేశారు. ఈ పోరాటాల్లో ఎన్నో త్యాగాలు చేసి కేసులను భరించినట్లు తెలిపారు. అలాంటి ఉద్యోగ సంఘాలకు ప్రస్తుతం గుర్తింపు కరువైందన్నారు. రాష్ట్రంలోని 33జిల్లాల్లోని ఉద్యోగుల కమిటీలందరూ తమ సమస్యల పరిష్కారం కోసం పోరాడేందుకు అడుగు ముందుకేయాలన్నారు. భద్రాద్రి జిల్లాలో వనరుల సరిపడా లేకున్నా ఉద్యోగులకు కనీస వసతులు లేకపోయినా వందశాతం విధులు నిర్వహిస్తున్నారని తెలిపారు. తమ సమస్యల పరిష్కారం కోసం ఎన్నికల కోడ్ ముగిసిన తరువాత రాష్ట్రవ్యాప్తంగా ఉన్నత అధికారులకు, ప్రభుత్వ ప్రతినిధులకు వినతి పత్రాలు అందిస్తామని స్పష్టం చేశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో ఉన్న ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలను కొలిక్కి తెచ్చి వాటి పరిష్కారానికి కృషి చేయాలన్నారు. సంఘం రాష్ట్ర బాధ్యతలు చేపట్టిన తరువాత భద్రాద్రి జిల్లాకు తొలిసారి రావడం మరచిపోని ఘట్టంగా మిగిలిపోతుందన్నారు. సమావేశంలో టీజీవోస్ భద్రాద్రి జిల్లా అధ్యక్షుడు సంఘం వెంకటపుల్లయ్య, మహిళ ఉపద్యక్షురాలు కనకదుర్గ, సంయుక్త కార్యదర్శి సులోచనరాణి, కార్యదర్శి విజయ్‌కుమార్, టీఎన్‌జీవోస్ భద్రాద్రి జిల్లా అధ్యక్షుడు అమరనేని రామారావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న టీజీవో రాష్ట్ర అధ్యక్షుడు

దేశ అభివృద్ధిలో మహిళలు కీలకం

దేశ అభివృద్ధిలో మహిళలు కీలకంగా వ్యవహరిస్తున్నారని, వివిధ రంగాలలో వారు అత్యుత్తమ స్థాయిలో ప్రతిభ చాటుతున్నారని టీజీవోస్ రాష్ట్ర అధ్యక్షుడు ఏలూరి శ్రీనివాసరావు తెలిపారు. కొత్తగూడెం క్లబ్‌లో నిర్వహించిన మహిళ దినోత్సవ వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వివిధ రంగాల్లో మహిళలు త్యాగాలతో కూడిన సేవలు చేస్తూ రాణిస్తున్నారని కొనియాడారు. కార్యక్రమంలో జిల్లాలోని వివిధ శాఖల్లో ప్రతిభ చూపిన మహిళ ఉద్యోగులను సత్కరించారు. కార్యక్రమంలో జిల్లా సంక్షేమ శాఖ అధికారి వేల్పుల విజేత, డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ సుకృత, సభ్యులు మోదుగు వెంకటేశ్వర్లు, యాదాద్రి, రుక్మిణి, తిరుమలేష్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



మహిళా ఉద్యోగిని సన్మానిస్తున్న దృశ్యం

ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
కొత్తగూడెం, ఇల్లెందు, భద్రాచలం, పినపాక, అశ్వారావుపేట
8
భద్రాద్రి కొత్తగూడెం
బుధవారం 20 మార్చి 2024



సీఆర్‌పీఎఫ్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం



భద్రాచలం, మార్చి 19: భద్రాచలంలోని ప్రభుత్వ ఏరియా వైద్యశాలలో మంగళవారం సీఆర్‌పీఎఫ్ 212 బెటాలియన్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేసి సీఆర్‌పీఎఫ్ జవాన్లు రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో కమాండెంట్ శ్రీవాత్సవ్, దివేష్ కుమార్, ఇన్స్‌పెక్టర్ మహిర్, డాక్టర్ మల్లేశ్వరరావు, చందు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

సమస్యల్లో మణుగూరు మునిసిపాలిటీ

ప్రధాన రహదారికే పారిశుధ్య పనులు పరిమితం

అరకొరగా కార్మికులు.. వార్డుల్లో పేరుకుపోతున్న సమస్యలు

రూరల్ గ్రామాలపై పట్టింపు కరువు

లక్షలు వెచ్చించి కొన్న వాహనాలు నిరుపయోగం

చెట్లకింద తుప్పుపడుతున్న వైనం

మణుగూరు, మార్చి 19: మణుగూరు మునిసిపాలిటీ పాలన కుంటుపడటంతో సమస్యల పరిష్కారం ప్రశ్నార్థకంగా మారింది. మునిసిపాలిటీ పరిధిలోని వార్డులు సమస్యల నిలయంగా మారాయి. పన్నుల వసూళ్లకు మాత్రమే కానీ మా సమస్యలు పట్టించుకునే దిక్కు లేదంటూ సర్వత్రా విమర్శలు వెలువడుతున్నాయి. 2005 నుంచి మణుగూరు పంచాయతీ థర్డ్ గ్రేడ్ మునిసిపాలిటీ గా రూపాంతరం చెంది స్పెషల్ అధికారి ఆధ్వర్యంలో పాలన ఆరంభమైంది నాటి నుంచి నేటి వరకు అధికారుల పాలనలోనే ఈ మునిసిపాలిటీ నడుస్తోంది.

ప్రధాన రహదారికే పారిశుధ్య పనులు

పారిశ్రామిక ప్రాంతంగా అభివృద్ధి చెందుతున్న మణుగూరులో ప్రధాన రహదారికి ఇరువైపులా పలు వ్యాపార దుకాణాలు ఉన్నాయి. ప్రధాన రహదారిపై పడిన చెత్తా చెదారాన్ని తొలగించి రోడ్డును శుభ్రపరచమే మునిసిపాలిటీ కార్మికులకు రోజు వారి పనిగా మారింది. ఉన్న దాదాపు 60 మంది కార్మికులు కాంట్రాక్టు విధానంలో పనిచేస్తున్నారు. ఇందులో రోజు హాజరయ్యే వారిలో కాలువలు తీసేందుకు, స్వీపింగ్ పనులకు విభజించి పంపిస్తున్నారు. వర్కర్లు కూడా రోజుకు దాదాపు 20 మంది మాత్రమే హాజరు అవుతున్నట్లు తెలుస్తోంది. వీరితో అరకొర పారిశుధ్య పనులు మాత్రమే చేసే వీలు అవుతున్నట్లు సమాచారం ఇక మునిసిపాలిటీ పరిధిలోని సుందరయ్య నగర్, శ్రీశ్రీనగర్, బాలాజీ నగర్, రాజుపేట, ఆదర్శనగర్, విఠల్‌రావు నగర్ ప్రాంతాల్లో ఎక్కడ చెత్త చెదారం అక్కడే దర్శనమిస్తోంది. కాలువల్లో మురుగు నీరు నిండి దోమలను వ్యాప్తి చేస్తున్నాయి. ప్రజలు అనారోగ్య పీడితులౌతున్నారు. ఆరు నెలలకో సారి వచ్చి కాలువలు బాగు చేసిన పాపన పోలేదు. గడ్డి చెత్తా చెదారం పెరిగిపోతున్నాయంటూ ఆదర్శనగర్, సుందరయ్యనగర్ ప్రాంత వాసులు గగ్గోలు పెడుతున్నారు.

గ్రామాల్లో పరిస్థితి మరీ అధ్వానం

మణుగూరు మునిసిపాలిటీ పరిధిలోని రూరల్ గ్రామాలు గా పేరున్న చిన్నరావిగూడెం, కమలాపురం, అన్నారం రాజుపేట విఠల్ రావునగర్ గ్రామాలను మునిసిపాలిటీ సిబ్బంది అధికారులు పట్టించుకోవడం లేదని స్థానిక గ్రామస్థులు అంటున్నారు. పేరుకే మునిసిపాలిటీ పరిధిలో ఉన్నాం, కూలీ నాలీ చెసుకుని జీవంచే వారికి పన్నులను బాగానే వసూళ్ళ చేస్తున్నారు.ఏ రకమైన మునిసిపాలిటీ సేవలు మాకు అందటం లేదని వాపోతున్నారు స్థానికులు. మౌళిక సదుపాయాలు లేవు గతం లో ఉన్న ఉపాధి హామీ పనులు కూడా లేవు.. పంచాయతీలుగా చేసి ఉపాధి చూపండి అని స్థానికులు కోరుతున్నారు.

లక్షలు వెచ్చించి కొన్నారు

మణుగూరు మునిసిపాలిటీలో ప్రజలకు మేలైన సేవలందించేందుకు లక్షలాది రూపాయలను వెచ్చిని రెండు స్వీపింగ్ మిషన్లు, నాలుగు ట్రాక్టర్లు, ఓ డోజర్ బుల్ వాహనం అన్నీ నిరుపయోగం మారాయి. మునిసిపాలిటీ ప్రాంగణంలోని చెట్ల కింద పెట్టారు. స్వల్ప రిపేర్లు చేయించక పోవడంతో ఈ వాహనాల్లో మూడు ట్రాక్టర్లు, స్వీపింగ్‌మిషన్లు, బుల్ ప్రొక్లెయినర్, సెప్టిక్ ట్యాంకర్, 8 ఆటోలు గత రెండేళ్ళ గా మూలన పడి తుప్పు పట్టే స్థితికి చేరుకున్నాయి. 15 చెత్తను సేకరించేందుకు ఆటోలను కొనుగోలు చేయగా 8 మాత్రమే వినియోగంలో ఉన్నాయి. నడిచే ట్రాక్టర్, ఆటోలకు ఏడుగురు డ్రైవర్లు ఉన్నారు. ట్రాక్టర్లు స్వీపింగ్ మిషన్లు 2 రూ 40 లక్షలు, ఓ జేసీబీ మిన్, ఋతాయువు చెత్తను సేకరించేందుకు 26లక్షల రూపాయాలు కొని పక్కన పెట్టారు. సెప్టిక్ ట్యాంకు 18 లక్షలు, బుల్ వాహనం 19 లక్షల చొప్పున కొనుగోలు చేశారు, ఇంత పెట్టు బడులు పెట్టి కొనుగోలు చేసిన యంత్రాలు నిరుపయోగంగా ఉన్నా పట్టించుకునే నాధుడే కరువయ్యాడు. జిల్లా కలెక్టర్ ప్రత్యేక దృష్టి సారిస్తే గానీ మణుగూరు మునిసిపాలిటీ పాలన వ్యవస్థ ఓ గాడీలో పడదని స్థానిక రాజకీయ పార్టీల నాయకులు అంటున్నారు. అస్థవ్యస్థంగా ఉన్న పాలన ప్రజలను ఇబ్బందుల పాలు చేస్తోందన్న ఆరోపనలు సర్వత్రా వెలువడుతున్నాయి. అధికారులు స్పందించాలని కోరుతున్నారు.


మునిసిపల్ కార్యాలయం పక్కన కాలువ దుస్థితి


నిరుపయోగంగా చెత్త సేకరించే ఆటోలు


బ్యాటరీలు, టైర్లు లేక ట్రాక్టర్ ఇంజన్లు


మూలనపడ్డ బుల్ ప్రొక్లయినర్ యంత్రం

పోరాట స్ఫూర్తిని కొనసాగించాలి

మల్లు స్వరాజ్యం వర్ధంతి సభలో సీపీఎం జిల్లా కార్యదర్శి కనకయ్య


నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

కొత్తగూడెం టౌన్, మార్చి 19: తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో భూమి, భుక్తి, విముక్తి కావాలని, బానిసత్వం, వెట్టిచాకిరి పోవాలని పోరాడిన మల్లు స్వరాజ్యం రెండో వర్ధంతిని సీపీఎం జిల్లా కార్యాలయంలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి అన్నవరపు కనకయ్య మల్లు స్వరాజ్యం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ పోరాట స్ఫూర్తిని కొనసాగించడమే మల్లు స్వరాజ్యానికి అర్పించే నిజమై నివాళి అన్నారు. ఈ కార్యక్రమంలో సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర నాయకులు మంద నర్సింహారావు, సీపీఎం పార్టీ జిల్లా కార్యదర్శివర్గసభ్యులు ఎం. జ్యోతి, లిక్కి. బాలరాజు, కమిటీ సభ్యులు కొండపల్లి శ్రీధర్, భూక్యా రమేష్, సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి వీరన్న, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి బి. వీరభద్రం, ఐద్వా జిల్లా సహాయ కార్యదర్శి ఎస్. లక్ష్మి, సింగరేణి ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు విజయగిరి శ్రీనివాస్, వై. వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

భద్రాచలంలో..

భద్రాచలం: ప్రజా వర్గ పోరాటాలను ముందుకు తీసుకుపోవడమే అమర జీవి మల్లు స్వరాజ్యంకు ఇచ్చే ఘనమైన నివాళి అని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు మచ్చా వెంకటేశ్వర్లు అన్నారు. మల్లు స్వరాజ్యం రెండో వర్ధంతి కార్యక్రమం మంగళవారం సీపీఎం పట్టణ కార్యదర్శి గడ్డం స్వామి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి మచ్చా వెంకటేశ్వర్లు పూలమాల వేసి నివాళ్లర్పించారు. అనంతరం మాట్లాడుతూ భూమి కోసం, భుక్తి కోసం, వెట్టిచాకిరి విముక్తి కోసం సామాజిక న్యాయ సాధన కోసం జరిగిన తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో వీరోచితంగా పోరాడిన యోధురాలని అన్నారు. ఆమెకు ఘనంగా నివాళులర్పించారు.

ఎమ్మెల్యేకు సీఐటీయూ వినతి


వినతిపత్రం సమర్పిస్తున్న నాయకులు

భద్రాచలం, మార్చి 19: గ్రామ పంచాయతీ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సీఐటీయూ ఆధ్వర్యంలో మంగళవారం భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావుకు వినతిపత్రం అందజేశారు. గ్రామ పంచాయతీ కార్మికులకు మూడు నుంచి ఆరు నెలలకు పైగా వేతనాలు బకాయి ఉన్నాయని బకాయి వేతనాలను వెంటనే చెల్లించేలా కృషి చేయాలని కోరారు. ఎన్నికల ముందు పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కారం చేస్తామని వేతనాలు పెంచుతామని మల్టీపర్పస్ విధానం రద్దు చేస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ ఆ దిశగా కార్మికులకు న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కె.బ్రహ్మాచారి ఎంబి నర్సారెడ్డి, విజయ్‌బాబు, చెన్నకేశవులు పాల్గొన్నారు.

సాదాసీదాగా సామాజిక తనిఖీ ప్రజావేదిక

సుజాతనగర్, మార్చి 19 : సుజాతనగర్ మండల కేంద్రంలో నిర్వహించిన ఉపాధి హామీ పనులకు సంబంధించిన సామాజికి తనిఖీ మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం సాదాసీదాగా జరిగింది. ఎన్నికల కోడ్ నేపథ్యంలో ప్రజలు లేకుండానే అధికారులు, తనిఖీ బృందాలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నాయి. మండలంలో 1 ఏప్రిల్, 2022 నుంచి 31 మార్చి, 2023 వరకు 12 నెలల కాలానికి, ఉపాధి పనులకు సంబంధించిన తనిఖీ నిర్వహించారు. మండలంలోని 20 పంచాయతీలలో గ్రామ సభలు నిర్వహించిన అనంతరం మండల సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించారు. ఈ సందర్భంగా ఆడిట్ నివేదికలను సామాజిక తనిఖీ ప్రజావేదికలో నేడు చదివి వినిపించారు. ఆయా గ్రామ పంచాయతీలలో హరితహారం కార్యక్రమంలో నాటిన వేలాది మొక్కలు చనిపోయాయని, కొన్ని గ్రామాలలో మస్టర్ రోల్ లేకుండా పని చేశారని, పలు చోట్ల కూలీ డబ్బులు ఇప్పటికీ రాలేదని తమ దృష్టికి వచ్చినట్లు డీఆర్‌పీలు తెలిపారు. సాంకేతిక తప్పిదాల నేపథ్యంలో రూ.9 వేల జరిమానాతో పాటు, రూ. 20,249 లను అధికారులు రికవరీకి ఆదేశించారు. 12 నెలల కాలానికి సంబంధించిన ఉపాధి హామీ పనులకు గాను రూ, 4,12,67,701/- లు ఖర్చు చేయగా.. వేతనాల రూపంలో రూ. 3,72,49,975/- లను కూలీలకు చెల్లించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ పీడీ రవి, విజిలెన్స్ అధికారి రమణ, ఎంపీడీఓ తలుగు వెంకటలక్ష్మి, డీఆర్‌పీలు, సెక్రటరీలు, టీఏలు, సిబ్బంది పాల్గొన్నారు.

యువత క్రీడలపై దృష్టి సారించాలి: కొత్వాల



బహుమతిని అందజేస్తున్న కొత్వాల

పాల్వంచ రూరల్, మార్చి 19: గ్రామీణ ప్రాంత యువతలో అపారమైన ప్రతిభ దాగి ఉంటుందని, క్రీడలపై దృష్టి సారిస్తే అనేక పతకాలు సాధించవచ్చని డీసీఎంఎస్ ఛైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు పేర్కొన్నారు. మండలంలోని నారాయణరావుపేట గ్రామంలో మంగళవారం ఆధ్వర్యంలో నిర్వహించిన టి.వి.ఎస్ క్రికెట్ పోటీలు మంగళవారంతో ముగిసాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. యువత చదువుతో పాటు క్రీడారంగంపై దృష్టి సారించి జాతీయ స్థాయిలో రాణిస్తే కేంద్ర, రాష్ట్ర ఉద్యోగాలు సాధించవచ్చని అన్నారు. ప్రతి ఒక్క చెడు వ్యసనాలకు దూరంగా ఉండి సమాజానికి ఉపయోగపడాలని అన్నారు. పినపాక జట్టుకు ప్రథమ బహుమతి రూ. 20వేలు, కల్వరి 11 జట్టుకు ద్వితీయ బహుమతి రూ. 10వేలు గెలుపొందిన జట్లకు ఆయన బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ యర్రంశెట్టి ముత్తయ్య, కాంగ్రెస్ పార్టీ మహిళా జిల్లా అధ్యక్షురాలు తోట దేవిప్రసన్న, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

ప్రధాన కార్యాలయం ఎదుట విద్యార్థి సంఘాల ధర్నా

రుద్రంపూర్ (సింగరేణి) మార్చి 19 : సింగరేణి యాజమాన్యం ఇచ్చిన ఉద్యోగ నోటిఫికేషన్‌కు వ్యతిరేకంగా తెలంగాణ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థి యువజన సంఘం, ఎస్ఎఫ్ఐ, విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో మంగళవారం సింగరేణి హెడ్డాఫీస్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాను ఉద్దేశించి తెలంగాణ ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ విద్యార్థి యువజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోటా శివశంకర్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి బుర్ర వీరభద్రంలు మాట్లాడుతూ సింగరేణి యాజమాన్యం అనాలోచితంగా పార్లమెంట్ ఎన్నికల కోడ్ వస్తుందని త్వరలో ఇంటర్నల్ ఎక్స్‌టర్నల్ ఉద్యోగాల నోటిఫికేషన్ తప్పులతడకగా విడుదల చేసిందన్నారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం ఇంటర్నల్ ఉద్యోగాలకి 33శాతం, రిజర్వేషన్ ఎక్స్‌టర్నల్ అభ్యర్థులకు 66శాతం సింగరేణిలో ఖాళీలను భర్తీచేయాలని, చాలా పోస్టులను సింగరేణి యాజమాన్యం ఇంటర్నల్ అభ్యర్థులతో నింపడం వల్ల చదువుకున్న యువత, మహిళలు అన్యాయానికి గురవుతున్నారని ఈ నోటిఫికేషన్‌ని వెంటనే నిలుపుదల చేయాలని, లేకపోతే భవిష్యత్‌లో పెద్ద ఎత్తున ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం జోక్యం చేసుకుని నిరుద్యోగులకు న్యాయం చేయాలని, వెంటనే నోటిఫికేషన్ సరి చేయాలని విద్యార్థి యువజన సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈ సమస్యను పరిష్కరించాలని కోరారు.


ధర్నా నిర్వహిస్తున్న విద్యార్థి సంఘాలు

కబడ్డీలో సత్తా చాటాలి

మణుగూరుటౌన్, మార్చి 19: కోలిండియా స్థాయిలో జరిగే క్రీడా పోటీల్లో కబడ్డీ విభాగంలో సింగరేణి క్రీడా కారులు సత్తా చాటి విజయకేతనం ఎగురవేయాలని ఏరియా ఎస్వోటు జీఎం వీసం కృష్ణయ్య అన్నారు. మంగళవారం ఏరియాలో సింగరేణి అన్ని ఏరియాల ఉద్యోగ క్రీడాకారుల ఆరు రోజు శిక్షణ శిబిరం ముగింపు కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కబడ్డీ శిక్షణను శిక్షణ పొందిన ప్రతీ క్రీడాకారుడు సద్వినియోగ పరుచుకోవాలన్నారు. ఏరియా డీజీఎం పర్సనల్ రమేష్ మాట్లాడుతూ.. మణుగూరు ఏరియాలోని భద్రాద్రి స్టేడియంలో రీజనల్ కంపెనీ స్థాయి, కోలిండియా లెవల్ పోటీలను విజయవంతంగా నిర్వహించిన మణుగూరు ఏరియా ఎంతో గుర్తింపును తెచ్చుకుందన్నారు. కార్యక్రమంలో ఏజీఎం సివిల్ వెంకటేశ్వర్లు, ఏఐటీయుసీ నాయకులు రాంనర్సయ్య, అసిస్టెంట్ స్పోర్ట్స్ సూపర్‌వైజర్ జాన్ వెస్లీ, శిక్షకుడు మురుగన్, హైదరాబాద్ కో ఆర్డినేటర్ ఆర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

అవసరాలకనుగుణంగా మొక్కలు పెంచాలి..

పాల్వంచ రూరల్, మార్చి 19: గ్రామ పంచాయతీ అవసరాలకు అనుగుణంగా మొక్కల పెంపకం చేపట్టాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్, డీఆర్‌డీవో విద్యాలత సూచించారు. మండల పరిధిలోని లక్ష్మిదేవిపల్లి, బసవతారక కాలనీ, జగన్నాథపురం, కేశవపురం పంచాయతీలో పెంచుతున్న నర్సరీలను ఆమె పరిశీలించి మాట్లాడారు. ప్రతి నర్సరీలో 100శాతం జర్మినేషన్ ఉండేలా చూడాలని అన్నారు. ప్రతి మొక్కల వరుస మొక్కల రకం తెలిసేలా బెడ్ ముందు బోర్డు ఏర్పాటు చేయాలని అన్నారు. వేసవి కాలం దృష్ట్యా మొక్కలకు ఎండ తగలకుండా నీరు, నీడను అందించాలని అన్నారు. అప్పుడే మొక్కలు త్వరగా ఎదుగుతూ వాడిపోకుండా ఉంటాయని అన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో విజయ భాస్కర్‌రెడ్డి, ఏపీవో పోరండ్ల రంగా, గ్రామ పంచాయతీ కార్యదర్శులు కృష్ణవేణి, రాంబాబు, సాయిరాం, క్షేత్ర సహాయకులు నాగేశ్వరరావు, శంకర్ తదితరులు ఉన్నారు.

అభయాంజనేయస్వామి ఆలయ వార్షికోత్సవం

ములకలపల్లి, మార్చి 19 : ములకలపల్లి మండల కేంద్రంలోని శ్రీ అభయాంజనేయస్వామి ఆలయ 22వ వార్షికోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఆలయకమిటీ ఆధ్వర్యంలో ఉదయం మంగళతోరణం అనంతరం స్వామివారికి పాలాభిషేకం, పంచామృతాభిషేకం, తమలపాకుపూజ నిర్వహించారు. పట్టువస్త్రాలు, పుష్పాలతో పూలదండలు వేసి అలంకరణ చేసి పూజలతో హనుమాన్‌చాలీసాను పఠించారు. కొత్తగూడెంకు చెందిన మూలగుండ్ల జగన్నాథం, శకుంతల దంపతులు స్వామివారి పూజలో పాల్గొని స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించారు. ఆలయ పూజారి ముకుందల సత్యనారాయణ శాస్త్రీ, సురేష్ శర్మలు పూజా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయకమిటీ అధ్యక్షులు శనగపాటి రవి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వార్షికోత్సవ కార్యక్రమానికి హజరైన భక్తులకు వ్యాపారి బిక్కుమల్ల సుధాకర్, శాంతి దంపతులు, మిరియాల అవినాష్ దంపతులు తీర్థప్రసాదాలు అందచేశారు.

మండలంలో ఎమ్మెల్యే పాయం పర్యటన


నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే పాయం

బూర్గంపాడు, మార్చి 19: బూర్గంపాడు మండల పరిదిలో మంగళవారం పినపాక శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు పర్యటించారు. అంజనాపురం గ్రామానికి చెందిన మాజీ సర్పంచు తేజీవత్ సూర్యం అనారోగ్యంతో సోమవారం మృతి చెందాడు. సూర్యం మృతదేహనికి పాయం పూలమాల వేసి నివాళులర్పించి కుటుంబసభ్యులను పరామర్శించారు. పర్యటనలో భాగంగా జింకలగూడెం గ్రామస్థులు మైనారిటీల ప్రార్థనస్థలం ఈద్గాతో పాటు కబరస్థాన్, క్రీడా ప్రాంగణం ఏర్పాటు చేయాలని కోరుతూ ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు. సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం మోరంపల్లిబంజర గ్రామంలో ఇటీవల మృతి చెందిన బాధిత కుటుంబసభ్యులను పరామర్శించి మనోధైర్యం కల్పించారు.

ఎమ్మెల్యే దృష్టికి ఓబీ కార్మికుల సమస్యలు

మణుగూరు టౌన్: సింగరేణికాలరీస్ మణుగూరు ఏరియాలోని ఓబీ కంపెనీల్లో పనిచేసే కాంట్రాక్టు కార్మికుల సమస్యలను మంగళవారం సాయంత్రం మణుగూరు పట్టణంలోని ప్రజా భవన్‌లో పినపాక ఎమ్మెల్యే పాయం దృష్టికి ఐఎన్‌టియూసీ ఓబీ కార్మికులు తీసుకుపోయారు. గత ఏడాది చేసుకున్న అగ్రిమెంట్ తో పాటు ఈ ఏడాది మార్చి నెలలో వేతనాలపై చేయాల్సిన అగ్రిమెంట్ గురించి వివరాలు తెలిపారు. 2018 సంవత్సరంలో హై పవర్ కమిటీ సూచించిన జీవోలను ఎమ్మెల్యేకు ఐఎన్‌టియూసీ నాయకులు అందించారు. సమస్యలు విన్న ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు సానుకూలంగా స్పందిస్తూ సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఏరియాలోని ఓసీ-2, ఓసీ- 4 దుర్గా కంపెనీ, మహాలక్ష్మి కేఎల్‌పి ఓబీ కంపెనీల కార్మికులు, ఐఎన్‌టియూసీ నాయకులు పాల్గొన్నారు.

జిల్లా గ్రంథాలయానికి ఇన్వర్టర్ వితరణ

కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్, మార్చి 19: ఆర్యవైశ్య కొత్తగూడెం పట్టణ అధ్యక్షుడు దారా నగేష్ ఆధ్వర్యంలో జిల్లా గ్రంథాలయానికి ఇన్వర్టర్ మంగళవారం వితరణ చేశారు. ఈ సందర్భంగా అధ్యక్షులు దారా నగేష్ మాట్లాడుతూ జిల్లా గ్రంథాలయంలో గ్రామీణా ప్రాంతంలోని విద్యార్థులు జిల్లా గ్రంథాలయానికి వచ్చి పోటీ పరీక్షలకు ప్రిపేర్ అయ్యే విద్యార్థుల అవసరాలు నిమిత్తం ఇన్వర్టర్‌ను వితరణ చేస్తున్నామని తెలిపారు. పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే విద్యార్థులు మంచిగా చదివి ప్రభుత్వ ఉద్యోగాలు సాధించాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో గ్రంథ పాలకులు డి.వరలక్ష్మీదేవి, జి.మణి మృదుల, ఆఫీస్ ఇంచార్జ్ నవీన్‌కుమార్, ఆర్యవైశ్య సంఘ సభ్యులు దారా రమేష్, కొయ్యడా నగేష్, నరేంద్రుల రుషికుమార్, జూలూరి ఆనంద్, దారా శ్రీను, గణేష్, కిరణ్, పాఠకులు తదితరులు పాల్గొన్నారు.

వైద్యుడి డబ్బులు డిమాండ్...?

ఏసీబీకీ బాధితుల ఫిర్యాదు

తప్పించుకున్నవైద్యులు

అశ్వారావుపేట రూరల్, మార్చి 19: అనారోగ్యంతో చనిపోయిన వ్యక్తిని ఎటువంటి పోస్టుమార్టం లేకుండా కుటుంబసభ్యులకు అప్పగించేందుకు ఓ ప్రభుత్వ వైద్యుడు డబ్బులు డిమాండ్ చేయగా బాధితులు ఏసీబీ అధికారులను సంప్రదించారు. విషయం బయటకు రావటంతో సదరు వైద్యులు ట్రాప్ నుంచి తప్పించుకున్నారనే విషయం అశ్వారావుపేటలో మంగళవారం దావాలంలా వ్యాపించింది. ఘటనపై ఏసీబీ అధికారులు, వైద్యశాఖ జిల్లా అధికారులు కూడా పూర్తిస్థాయిలో వివరాలు సేకరిస్తున్నట్లుగా సమాచారం. ఇందుకు సంబందించి విశ్వసనీయ సమాచారం మేరకు మండలంలోని ఓ గ్రామానికి చెందిన 37 ఏళ్ల గిరిజనుడు గత వారం రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. అయితే సోమవారం పరిస్థితి విషమంగా ఉండటంతో కుటుంబసభ్యులు అశ్వారావుపేటలోని ప్రభుత్వ వైద్యశాలకు తీసుకువచ్చారు. అయితే రాత్రి పదకొండు గంటల ప్రాంతంలో వైద్యుల సూచనల మేరకు గిరిజనుడిని కొత్తగూడెం తరలిస్తున్న క్రమంలో దమ్మపేట మండలంలో మృతిచెందాడు. అయితే మృతదేహాన్ని వాహనదారులు ఆసుపత్రికి తీసుకురాగా వైద్యసిబ్బంది పోస్టుమార్టం గదిలో ఉంచారు. మృతిచెందిన వ్యక్తి కుటుంబసభ్యులు, గ్రామపెద్దలు మంగళవారం పోలీస్‌స్టేషన్‌కు వచ్చి మృతిపై ఎటువంటి అనుమానాలు లేవని, శవాన్ని ఇంటికి తీసుకెళతామని తెలిపారు. అనంతరం ఆసుపత్రి వద్దకు విధుల్లో ఒక డాక్టర్ వచ్చి ఆసుపత్రి అభివృద్ధికి రూ.40వేలు ఇస్తే ఎటువంటి పోస్టుమార్టం లేకుండా చేస్తామని తెలిపారు. అయితే రెండు మూడు వేలు అయితే ఇస్తామని, తమ వద్ద అంత డబ్బులేదని తెలపటంతో మృతదేహాన్ని అక్కడే ఉంచారు. డబ్బులు అడిగిన సదరు వైద్యులు ఓ కాంట్రాక్టర్ సిబ్బందిని అక్కడ ఉంచి నగదు తీసుకోవాలని చెప్పినట్లుగా తెలిసింది. ఇదే సమయంలో బాదితులు ఏసీబీ అధికారులు సమాచారం అందించారు. దాదాపు మూడు గంటల ప్రాంతంలో ఏసీబీ అధికారులు పేటకు వచ్చి సదరు డాక్టర్ వద్దకు ఇద్దరిని పంపగా రెండు మూడు వేల కోసం ఇప్పటివరకు ఆగారా మృతదేహాన్ని తీసుకెళ్లాలని చెప్పాగా అంటూ వైద్యులు అనటంతో వెళ్లిన ఇద్దరు తిరిగి ఆసుపత్రి వద్దకు వచ్చి మృతదేహాన్ని ఇంటికి తీసుకెళ్లారు. దీనిపై సదరు వైద్యుడిని వివరణ కోరగా తానేమి డబ్బులు అడగలేదని, సిబ్బందికి మాత్రమే రెండు మూడు వేలు ఇవ్వాలని చెప్పినట్లు తెలిపారు.

వైభవంగా రామయ్య కల్యాణం

దుమ్ముగూడెం, మార్చి 19: భద్రాచల సీతారామచంద్ర స్వామి దేవస్థానం అనుబంధ ఆలయమైన మండలంలోని పర్ణశాల రామాలయంలో మంగళవారం పునర్వసు నక్షత్రం సందర్భంగా సీతారాముల కళ్యాణాన్ని ఘనంగా జరిపించారు. తిరుమంజనం, నూతన వస్త్రాలంకరణ, ఆలయ ప్రదక్షిణ, విశ్వక్సేనపూజ, పుణ్యాహవచనం, రక్షాబంధనం, యజ్ఞోపవీత యోత్రధారణ, స్వామి వారి అమ్మవారి ప్రవర్లు, మంగళాష్టకాలు, మహాసంకల్పం, మాంగల్యపూజ, మాంగల్యధారణ, మంత్రపుష్పకార్యక్రమాలను శాస్త్రోక్తంగా జరిపించారు. కార్యక్రమంలో అర్చకులు కిరణ్ కుమారాచార్యులు, వెంకట్రమణాచార్యులు, సిస్టం ఆపరేటర్ అనీల్, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు. భక్తులు అధిక సంఖ్యలో కల్యాణాన్ని వీక్షించి, తరించారు.

చిన అరుణాచలాన్ని దర్శించిన ఈవో



దుమ్ముగూడెం. మార్చి 19: చిన అరుణాచలంగా పేరొందిన నరసాపురం ద్వాదశ జ్యోతిర్లింగ క్షేత్రం, పర్ణశాల రామాలయాల్ని సీతారామచంద్రస్వామి దేవస్థానం ఈవో రమాదేవి మంగళవారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. చిన్న అరుణాచలంలో ఈవో ప్రదక్షిణలు చేసిన అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ వ్యవస్థాపకులు శివనాగస్వామి ఈవో రమాదేవికు జ్ఞాపికనందజేశారు. పర్ణశాల కుటీరం ప్రాంతాన్ని సైతం ఈవో సందర్శించారు.

ఐక్యంగా ముందుకు సాగాలి

మణుగూరు, మార్చి 19: మణుగూరు లారీ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్‌లోని లారీ ఓనర్లు ఐక్యంగా కలసి సమస్యల పరిష్కారానికి ముందుకు సాగాలని సీపీఐ రాష్ట్ర నాయకులు అయోధ్య అన్నారు. మంగళవారం లారీ ఓనర్స్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అసోసియేషన్‌లోని లారీ ఓనర్లు రాజకీయాలను పక్కన బెట్టి అసోసియేషన్ నిబంధనల మేరకు ఏకతాటిపై నిలవాలని అండగా ఏఐటీయుసీ యూనియన్, సీపీఐ పార్టీ నిలుస్తుందని హామినిచ్చారు. లారీ అసోసియేషన్ ఈ ప్రాంతంలో బలంగా ఉందంటే అందుకు కారణం సీపీఐ పార్టీ అన్న విషయాన్ని ఎవరు మరవరాదన్నారు. కార్యక్రమంలో నాయకులు సరెడ్డి పుల్లారెడ్డి, ఆర్.లక్ష్మీనారాయణ, జి.వెంకటేశ్వర్లు, ఆదర్ల సురేందర్, ఎం.నాగేశ్వరరావు, డీ సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఈ సస్పెన్షన్‌ను రద్దు చేయాలి

మణుగూరుటౌన్, మార్చి 19: సింగరేణి సంస్థలోని మందమర్రి ఏరియాలో దురదుష్టవశాత్తు జరిగిన పాటల్ ప్రమాదం పట్ల సంతాపాన్ని వ్యక్తం చేస్తూ ప్రమాదానికి బాధ్యున్ని చేసి ఎస్ఈ(ఈఅండ్ఎం) శశిధర్ సస్పెన్షన్ రద్దు చేయాలని సీఎంఓఏఐ సింగరేణి బ్రాంచి అద్యక్షులు టీ లక్ష్మీపతిగౌడ్ కోరారు. మంగళవారం ఏరియా జీఎం కార్యాలయం ఆవరణలో ఈ మేరకు శశిధర్ సస్పెన్షన్‌పై నిరసన వ్యక్తం చేసి ఏరియా ఎస్వోటు జీఎంకు వినతి పత్రమందజేశారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు లక్ష్మీపతిగౌడ్ మాట్లాడారు. నివేదిక రాకముందే ఓ అధికారిని సస్పెండ్ చేయడం బాధకరమన్నారు. ఇటువంటి సంఘటనలు అధికారుల మనోధైర్యాన్ని, మనోభావాలను దెబ్బతీస్తుందని పేర్కొన్నారు. సస్పెన్షన్ ఎత్తివేయాలని సీఎండీకి విజ్ఞప్తి చేశారు.

నిబంధనలు పాటించాలి

ఇల్లెందురూరల్, మార్చి 19: లోక్‌సభ ఎన్నికల నేపద్యంలో ప్రజలు, వాహనదారులు ఎన్నికల నిబందనలు పాటించాలని ఇల్లెందు పోలీస్ సీఐ టీ.కరుణాకర్ కోరారు. మంగళవారం ఇల్లెందు మండలం నెహ్రూనగర్ పోలీస్ చెక్ పోస్టును ఆయన పరిశీలించారు. ప్రజలు, వాహనదారులు ఎటువంటి రశీదులు లేకుండా నగదు తీసుకెళ్లవద్దని సూచించారు. 50వేల రూపాయల కంటే అదికంగా నగదు తీసుకెళ్తే ఆ నగదుకు సరైన రశీదులు చూపించాలని, లేని పక్షంలో ఆ నగదును సీజ్ చేసి ఎన్నికల అధికారులకు అప్పగించబడుతుందని తెలిపారు. ఇల్లెందు మండలంలో నెహ్రూనగర్, రోంపేడు, లలితాపురం గ్రామంలో ఎన్నికల సందర్భంగా పోలీస్ చెక్‌పోస్టులు ఏర్పాటు చేశామని సీఐ కరుణాకర్ తెలిపారు.